www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం|| లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 141 | మంగళవారం 07.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# యాదాద్రి తరహాలో మరో టెంపుల్..

## తారామతి బారాదరిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

**టూరిజం రంగంలో భారీ మార్పులకు శ్రీకారం..**

**ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు**



పర్యాటక రంగాన్ని ప్రకృతికి దగ్గరగా తీసు కెళ్లేందుకు వీలుగా క్యూర్ పరిధిలోని అటవీ భూములను, పర్యాటక శాఖతో సమన్వయం చేసుకుంటూ 'ఎకో టూరిజం'గా మార్చాలని సీఎం ఆదేశించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలోనే నగరంలో మరిన్ని ఎకో పార్కులను అందుబాటులోకి తేవాలన్నారు. ప్రతిష్ఠాత్మక ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని చెప్పారు. ఈ అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల పర్యవేక్షణ కోసం ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

- పర్యాటక ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని సీఎం ఆదేశం
- అటవీ భూముల్లో ఎకో టూరిజం అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్
- ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ పర్యాటక కేంద్రాల అభివృద్ధి
- తారామతి బారాదరిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సీఎం సూచన
- దుర్గం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
- వికారాబాద్ టూరిజం హబ్ అభివృద్ధికి సీఎం ఆదేశాలు
- వీరభద్రస్వామి ఆలయానికి పాలక మండలి ఏర్పాటు చేయాలి
- పురానాపూల్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచన
- అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఎకో టూరిజం అభివృద్ధి
- గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కసరత్తు ప్రారంభించాలని సీఎం
- పర్యాటక రంగంలో పెట్టుబడులపై దృష్టి పెట్టిన ప్రభుత్వం
- టూరిజం అభివృద్ధికి శాఖల సమన్వయం పెంచాలని సీఎం

02

**పురానాపూల్ బ్రిడ్జిపై ట్రాఫిక్ మళ్లింపు?**

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

రాష్ట్రంలో తలపెట్టిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి నిర్దేశించుకున్న పనులను వేగవంతం చేయడానికి పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు గారు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ గారు, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూముల్లో అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో ఎకో పార్కులుగా తీర్చిదిద్దాలని సూచించారు. నగరంలోని పర్యాటక ప్రాంతాలను మరింతగా తీర్చిదిద్దాలని, తారామతి బారాదరి మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని చెప్పారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను అధునికీకరించాలని ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని...

# కాళేశ్వరం పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలి..

## కేసీఆర్, కేటీఆర్‌లపై పొంగులేటి ఫైర్

**పేదల సొంతింటి కల నెరవేరుస్తామన్న మంత్రి**

- కాళేశ్వరం కట్టింది కూల్చింది బీఆర్ఎస్‌యే
- కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలని సవాల్
- కాళేశ్వరంపై బీఆర్ఎస్ విమర్శలు హాస్యాస్పదం
- ఎన్‌డీఎస్ఏ హెచ్చరికలను బీఆర్ఎస్ పూర్తిగా విస్మరించింది
- పేదలకు ఇళ్లు ఇవ్వని బీఆర్ఎస్ ప్రభుత్వం
- అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసి అందిస్తామని హామీ
- తల తాకట్టు పెట్టైనా పేదలకు ఇళ్లు ఇస్తాం
- గుడిసెలులేని తెలంగాణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- కాళేశ్వరంపై సభలో చర్చకు సిద్ధమన్న మంత్రి పొంగులేటి
- కేసీఆర్ సభకు వచ్చి నిజాలు చెప్పాలని డిమాండ్

03

**గుడిసెలులేని తెలంగాణే కాంగ్రెస్ లక్ష్యం**

**కాళేశ్వరం కట్టింది, కూల్చింది బీఆర్ఎస్‌యే**



సిద్దిపేట వేదికగా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి లక్షల కోట్ల రూపాయల నిధులు వచ్చాయి కానీ, పేదవాడికి ఒక సొంత ఇల్లు కట్టించి ఇవ్వడానికి మాత్రం వారికి మనసు రాలేదని మండిపడ్డారు.




# పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- త్వరలో ములుగు జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- పూర్తయిన అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు
- వర్షాకాలంలో లక్ష్యానికి మించి మొక్కలు నాటాలని మంత్రి సీతక్క ఆదేశం
- అటవీ శాఖ ద్వారా విస్తృతంగా మొక్కల పంపిణీ చేయాలని సూచన
- జిల్లా అభివృద్ధి పనులపై అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం

03

# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి..

- ముఖర్జీ సేవలు దేశానికి చిరస్మరణీయమన్న బీజేపీ
- కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తున్నాయి
- డ్యాం భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది
- కాళేశ్వరం అవినీతిపై రేవంత్ మౌనం ఎందుకు?
- హైడ్రా పేదలపైనే చర్యలు తీసుకుంటోందని విమర్శ
- ఎంఐఎం అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి
- హైకోర్టు ఆదేశాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్
- నిష్పక్షపాతంగా హైడ్రా పనిచేయాలని బీజేపీ డిమాండ్

02



# ఆకస్మిక గుండెపోటు మరణాలకు చెక్!




**గుండెపోటు ముప్పును ముందే గుర్తించే ఏఐ..**

ఈసీజీ డేటాతో గుండెపోటు ప్రమాదాన్ని అంచనా వేసిన ఏఐ

- ఈసీజీలో కనిపించని ప్రమాదాన్ని గుర్తించిన కృత్రిమ మేధస్సు
- గుండెపోటు మరణాలను తగ్గించడంలో ఏఐ కీలక ముందడుగు
- సాధారణ పరీక్షల్లో కనిపించని ముప్పును గుర్తించిన ఏఐ టెక్నాలజీ
- గుండెపోటు రాకముందే హెచ్చరించే కొత్త ఏఐ మోడల్
- దశాబ్ద పరిశోధన ఫలితం.. గుండెపోటు ముప్పుపై ఏఐ సరికొత్త సంకేతం
- ఆరోగ్యంగా కనిపించినా ప్రమాదం.. ఏఐతో ముందస్తు గుర్తింపు సాధ్యం
- ఈసీజీ డేటాతో గుండెపోటు ప్రమాదాన్ని అంచనా వేసిన ఏఐ
- 86 శాతం అధిక ప్రమాదంలో ఉన్నవారిని కొత్తగా గుర్తించిన ఏఐ
- గుండెపోటు నివారణలో విప్లవాత్మక అడుగు.. ఏఐతో ముందస్తు హెచ్చరిక

02

ప్రపంచవ్యాప్తంగా ఆకస్మాతుగా సంభవిస్తున్న గుండెపోటు మరణాలు ఆందోళన కరంగా మారాయి. ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించే వ్యక్తులు కూడా ఒక్కసారిగా

# బీజేపీకి పక్షపాతం లేదు

## బీఆర్ఎస్ కట్టిందని కన్నేపల్లి నుంచి నీటిని ఆపొద్దు..

**ఎప్పుడు ఎన్నికలొచ్చినా రేవంత్ కు ఓటమే**

**మెట్రో విస్తరణ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్**



- కన్నెపల్లి పంప్‌హౌస్ వెంటనే ప్రారంభించాలని ఈటల డిమాండ్
- విమర్శలు కాదు రైతులకు నీళ్లు కావాలని ఈటల
- కాళేశ్వరం దోషులను శిక్షించండి రైతులను కాదు
- కన్నెపల్లి పంపింగ్ ఆలస్యం చేయొద్దని ఈటల సూచన
- విశాల దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలి: ఈటల రాజేందర్
- హైడ్రాకు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మూల్యం తప్పదన్న ఈటల
- పేదల ఇళ్లే హైడ్రా లక్ష్యమని ఈటల విమర్శ
- హైడ్రా అసలు స్వరూపం బయటపడిందన్న ఈటల
- మెట్రో విస్తరణ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్
- మెట్రోకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందన్న ఈటల

03


**కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయాలు మానాలి**

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ ఖాయం

# భర్త నరాల్లోకి 'హార్పిక్'

## రాష్ట్రంలో మరో భార్యామణి నిర్వాకం..





**ప్రియుడితో కలిసి భర్త హత్యకు పక్కా స్కెచ్**

ప్రియుడి మోజులో భర్తను దారుణంగా హతమార్చిన ఘటన

నరాల్లోకి టాయిలెట్ క్లీనర్ ఎక్కించి భర్తను చంపిన భార్య

- ప్రియుడి కోసం భర్తను కిరాతకంగా హత్య చేసిన భార్య
- వివాహేతర సంబంధం కోసం భర్త ప్రాణాలు తీసిన సంధ్య
- భవనం పై నుంచి తోసేసి.. హార్పిక్ ఇంజెక్ట్ చేసి హత్య
- బతికే ఉన్నాడని గుర్తించి మరోసారి దారుణానికి పాల్పడిన భార్య
- ప్రియుడితో కలిసి భర్త హత్యకు పక్కా స్కెచ్
- మద్యం తాగించి.. పై నుంచి తోసేసి.. చివరికి హార్పిక్‌తో హత్య

06




# మొబైల్ యూజర్లకు షాక్..

**త్వరలోనే భారీగా పెరగనున్న టారిఫ్స్!**

- మొబైల్ రీచార్జ్ ధరలు మళ్లీ పెరగనున్నాయా?
- మరో 3–4 నెలల్లో టారిఫ్ షాక్..!
- మొబైల్ వినియోగదారులకు భారీ ఆర్థిక భారం
- 12–15%వరకు పెరగొచ్చని అంచనా
- రీచార్జ్ ఖర్చులు పెరిగే సూచనలు

02

# మొబైల్ యూజర్లకు షాక్..


**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మొబైల్ వినియోగదారుల నెత్తిన మరో పిడుగు పడనుంది. భారతీయ టెలికాం రంగంలో రాబోయే మూడు నుండి నాలుగు నెలల్లో మొబైల్ ఛార్జీలు భారీగా పెరిగే అవకాశం ఉందని 'సెంట్రమ్ ఇన్స్టిట్యూషనల్ రీసెర్చ్' తాజా నివేదికలో అంచనా వేసింది. మార్కెట్ కన్సాలిడేషన్ తర్వాత ధరలు పెంచడానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడటమే దీనికి కారణమని ఆ సంస్థ వెల్లడించింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆర్థిక అనిశ్చితి కారణంగా ఇప్పటికే సగటు మానవుడు ఇబ్బందులు పడుతుండగా ఇప్పుడు మొబైల్ రీచార్జి కూడా మరింత ప్రియం కానుండటం సామాన్యుల బతుకులపై ఆర్థిక భారంగా మారనుంది.

**12-15 శాతం వరకు పెరిగే చాన్స్:**

సామాన్యులకు షాక్ ఇస్తూ ఈ సారి ఏకంగా 12-15 శాతం వరకు టారిఫ్స్ పెరిగే అవకాశం ఉందని ఈ సంస్థ అంచనావేసింది. ప్రస్తుతం మార్కెట్లో కేవలం 3 ప్రైవేట్ + 1 ప్రభుత్వ ఆపరేటర్లు మాత్రమే ఉన్నారని, అందువల్ల రాబోయే 3-4 ధరల పెంపు ఉండే అవకాశం ఉందని ఈ బ్రోకరేజ్ సంస్థ తన Q1FY27 టెలికాం అండ్ ఇంటర్నెట్ సెక్టార్ ప్రివ్యూ నివేదికలో తెలిపింది. ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ల 'వినియోగదారుడి సగటు ఆదాయం' త్రైమాసిక ప్రాతిపదికన (QoQ) 1-1.5 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. వినియోగదారులు 2G నుండి 4G, 5G నెట్‌వర్క్‌లకు మారడం, పోస్ట్‌పెయిడ్ కస్టమర్ల సంఖ్య పెరగడం మరియు ఈ త్రైమాసికంలో ఎక్కువ రోజులు ఉండటం దీనికి కారణాలని పేర్కొంది.

**పెంపుపై కంపెనీల వ్యూహాలు:**

నిజానికి గత కొంత కాలంగా టారిఫ్ ల ధరలు పెంచేందుకు టెలికాం సంస్థలు ప్రణాళికలు రచిస్తున్నాయి. G సేవలను ఉచితంగా అందించడం వల్ల కంపెనీలు ఆశించినంత లాభాల్లో లేవని తాము పెట్టిన భారీ పెట్టుబడులను తిరిగి రికవరీ చేసుకోవడంతో పాటు, ప్రతి కస్టమర్ నుండి వచ్చే సగటు ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవాలనే వ్యూహాత్మక ప్రణాళికతోనే ఈ టెలికాం కంపెనీలు టారిఫ్ ధరలు సవరించాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ సైతం పెంపు ఉండబోతోందనే అంచనా ఇప్పుడు మొబైల్ యూజర్ల వెన్నులో వణుకు పుట్టించేలా మారింది.



# 'స్టేట్ ఇన్నోవేషన్ రిజిస్ట్రీ' సర్వేతో పేదలకు ముప్పు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని భావిస్తున్న 'స్టేట్ ఇన్నోవేషన్ రిజిస్ట్రీ' , సామాజిక సర్వేపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేకపోవడం వల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ లేఖ రాస్తూ.. ఎస్ఐఆర్ సర్వేను ప్రారంభించే ముందే తెలంగాణలోని పేదలందరికీ శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలను ఉచితంగా జారీ చేయాలని డిమాండ్ చేశారు.

**52% మంది దగ్గర బర్త్ సర్టిఫికెట్లు లేవు**

దేశంలోని పేదల వద్ద ప్రాథమిక పత్రాల కొరతను ఎత్తి చూడడానికి అసదుద్దీన్ ఒవైసీ ప్రముఖ థింక్ ట్యాంక్ 'లోకనీతి-సిఎస్‌డీఎస్' , జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేగణాంకాలను ప్రస్తావించారు. "ఢిల్లీతో పాటు ఐదు రాష్ట్రాల్లో లోకనీతి సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం.. దేశంలో ఇప్పటికీ 52 శాతం మంది ప్రజల వద్ద పుట్టిన తేది ధృవీకరణ పత్రం లేదు. అలాగే 41 శాతం మందికి నివాస ధృవీకరణ పత్రాలు , 42 శాతం మందికి కుల ధృవీకరణ పత్రాలు లేవు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం కేవలం సంపన్న వర్గాలలోని 82 శాతం మంది పిల్లలకే బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కఠినమైన డాక్యుమెంటేషన్‌తో సర్వేలు నిర్వహిస్తే.. నిరక్షరాస్యులు, నిరుపేదలు, గిరిజన, దళిత. మైనారిటీ వర్గాల ప్రజలు రేషన్, ఫించన్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాలను కోల్పోతారు" అని ఒవైసీ స్పష్టం చేశారు. అందువల్ల పేదల ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం తక్షణమే పీఆర్‌సీ డ్రైవ్‌ను చేపట్టాలని ఒవైసీ సీఎంకి రాసిన లేఖలో కోరారు.

# యాదాద్రి తరహాలో మరో టెంపుల్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** లంగాణను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ లోని బోధి పెవిలియన్‌లో పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తారామతి బారామతిని టూరిజం ప్లేస్‌గా మరింత గా అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని అధికారులను సీఎం ఆదేశించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునీకరించాలన్నారు. టూరిజం హబ్ డెవలప్మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వికారాబాద్‌లో వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయయడంతో ఈ ఆలయానికి యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**ఎకో పార్కులు.. ఫ్యూచర్ సిటీలో ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్:**

పర్యాటక రంగాన్ని ప్రకృతికి దగ్గరగా తీసుకెళ్లేందుకు వీలుగా క్యూర్ పరిధిలోని అటవీ భూములను, పర్యాటక శాఖతో సమన్వయం చేసుకుంటూ 'ఎకో టూరిజం'గా మార్చాలని సీఎం ఆదేశించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలోనే నగరంలో మరిన్ని ఎకో పార్కులను అందుబాటులోకి తేవాలన్నారు. ప్రతిష్టాత్మక ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని చెప్పారు. ఈ అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల పర్యవేక్షణ కోసం ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**పురానాపూల్ బ్రిడ్జిపై ట్రాఫిక్ మళ్లింపు?**

పాతబస్తీలోని చారిత్రక పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చెప్పారు. బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, అవసరమైతే అక్కడ ట్రాఫిక్‌ను మళ్లించి పూర్తి స్థాయిలో పర్యాటక జోన్‌గా మార్చే అవకాశాలను పరిశీలించాలన్నారు. ఈ ఏడాది డిసెంబరులో నిర్వహించ తలపెట్టిన 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్' పై ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

ఈ మెగా సమ్మిట్ విజయవంతం కావడానికి వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని, ఇందుకోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# ఏ క్షణంలోనైనా ఆకస్మిక తనిఖీలు చేస్తా..

**తుంగతుర్తి,ఫ్లాష్ ఇండియా :** ఏ క్షణంలోనైనా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, ఆ తనిఖీల్లో ఏవైనా పొరపాట్లు జరిగినట్లు తేలితే అందుకు పూర్తిగా సంబంధిత సిబ్బందినే బాధ్యులను చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ఎస్టీ బాలికల గురుకుల కళాశాల సిబ్బందిని హెచ్చరించారు. నియోజకవర్గ కేంద్రం తుంగతుర్తిలోని ఎస్టీ బాలికల గురుకుల కళాశాలలో ఆర్‌టీఐసీఎల్ఈ-275(1) పథకం కింద రూ.4 కోట్ల నిధులతో నిర్మించనున్న అదనపు వసతిగృహం, వంటగది-కమ్-డైనింగ్ హాల్, టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. దేశంలో ఎవరికి దక్కని గౌరవం ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. కళాశాలలో ఖాళీగా ఉన్న ఆరు లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం కమిషనర్‌ను, అవసరమైతే ముఖ్యమంత్రిని కూడా కలుస్తానని హామీ ఇచ్చారు. పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు



రూ.50 వేల నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. అలాగే, తుంగతుర్తిలో త్వరలోనే ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా ఆర్‌సీఓ జాను నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, డీఎస్పీ ప్రసన్నకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు రేగటి రవి, మల్లారెడ్డి, సుంకరి జనార్ధన్, గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.



# తెలంగాణ అసెంబ్లీలో నూతన శకం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ అసెంబ్లీలో నూతన శకం ప్రారంభమైంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇటు తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కూడా అసెంబ్లీలో మీడియా అడ్వైజరీ కమిటీకి ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. కానీ సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాలతో అసెంబ్లీ.. మండలి కార్యదర్శులు మీడియా అడ్వైజరీ కమిటి కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు పనులు దగ్గరుండి పర్యవేక్షించారు. అసెంబ్లీ అడ్వైజరీ కమిటీ కోసం ప్రత్యేకంగా దేశంలో ఏ అసెంబ్లీలో ప్రత్యేక కార్యాలయం లేదు. పార్లమెంట్‌లో కూడా ఇలాంటి వసతి ఏర్పాటు జరగలేదు. కానీ మొదటి సారి తెలంగాణ అసెంబ్లీలో మీడియా అడ్వైజరీ కమిటీ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు జరిగింది. మీడియా అడ్వైజరీ కమిటీ కార్యాలయం ఇవాళ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. ఎంపీ వేం నరేందర్ రెడ్డిలు ప్రారంభించారు. కమిటి చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కో చైర్మన్ పరిపూర్ణ చారి. కమిటి సభ్యులు.. ఉదయం పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొని శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. అఖండ భారత సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహానేత శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకున్నారు. దేశ సమైక్యత, జాతీయత కోసం ఆయన చేసిన త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై స్పందించిన ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం డ్యాం భద్రతపై జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికీ మరమ్మతులు ప్రారంభించకపోవడం ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా మార్చుకుని భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన రాంచందర్ రావు, ఆ అవినీతి అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. అవినీతిపై నామమాత్ర చర్యలతో ప్రభుత్వం చేతులు దులుపుకుందని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. మరోవైపు హైడ్రా చర్యలపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను మాత్రమే కూల్చివేస్తున్నారని, అయితే ఎంఐఎంకు చెందిన అక్రమ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఫాతిమా విద్యాసంస్థలలో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు అధికారులే కోర్టుకు తెలిపారని, హైకోర్టు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఆక్రమణలు జరిగినట్లు అంగీకరించినప్పటికీ అక్రమ నిర్మాణాలను తొలగించకపోవడం వెనుక కాంగ్రెస్, ఎంఐఎం దోస్తీ కారణమని రాంచందర్ రావు ఆరోపించారు. హైడ్రా నిష్పక్షపాతంగా పనిచేసి అందరికీ ఒకే విధమైన న్యాయం చేయాలని, హైకోర్టు ఆదేశాల మేరకు ఎంఐఎంకు చెందిన అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్, ఎంఐఎం, హైడ్రా వైఖరికి వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజాపోరాటం చేపడుతుందని రాంచందర్ రావు అన్నారు.

# ఆకస్మిక గుండెపోటు మరణాలకు చెక్!

**న్యూ ఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా ఆకస్మాతుగా సంభవిస్తున్న గుండెపోటు మరణాలు ఆందోళనకరంగా మారాయి. ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించే వ్యక్తులు కూడా ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోతున్నారు. ముఖ్యంగా కరోనా పరిస్థితుల తర్వాత ఈ సడెన్ కార్డియాక్ డెత్‌లు పెరిగిపోవడం వైద్య రంగానికి పెద్ద సవాలుగా మారింది. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఉన్నట్టుండి తమ వారు కాలం చేస్తుంటే ఏమి చేయలేని నిస్సాయస్థితుల్లో అనేక మంది ఉండిపోతున్నారు. ఎలాంటి దురలవాట్లు లేని వారి గుండె సైతం లయతప్పుతుండటంతో ఈ పరిస్థితిపై సర్వత్రా ఆందోళన రేకెత్తుతోంది. ఈ నేపథ్యంలో ఈ సమస్యకు కృత్రిమ మేధస్సు అద్భుతమైన పరిష్కార మార్గం చూపించింది. సమస్యను ముందుగానే గుర్తించేలా శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనల్లో కీలక ముందడుగు పడింది. ఏఐ సాయంతో ఈ ప్రమాదాన్ని ముందుగానే ఊహించే సరికొత్త గుండె సంకేతాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సాధారణ స్క్రీనింగ్ పరీక్షల్లో అంతా నార్మల్‌గా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో రాబోయే ముప్పును ఈ ఏఐ గుర్తించగలదని పరిశోధకులు చెబుతున్నారు.

**దశాబ్ద కాలపు పరిశోధన:**

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లే పరిశోధకులు సాధారణంగా చేసే ఈసీజీ పరీక్షలో ఇప్పటివరకు వైద్యులకు తెలియని ఓ ప్రత్యేక సంకేతాన్ని ఏఐ ద్వారా గుర్తించారు. ఈ సంకేతం భవిష్యత్తులో ఆకస్మిక గుండె మరణం సంభవించే ప్రమాదాన్ని ముందుగానే అంచనా వేయడంలో సహాయపడుతుందని వెల్లడించారు. బెర్క్లీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ జియాద్ ఒబెర్మేయర్ నేతృత్వంలోని బృందం దాదాపు పదేళ్ల పాటు శ్రమించి ఈ పరిశోధన సాగించింది. స్వీడన్‌కు చెందిన 4,40,000 కంటే ఎక్కువ ఈసీజీ రేఖాచిత్రాలను, మరణ ధృవీకరణ పత్రాలను లింక్ చేసి, వాటిని విశ్లేషించడానికి ఏఐ మోడల్‌కు శిక్షణ ఇచ్చారు. అనంతరం అమెరికా, తైవాన్ దేశాలకు చెందిన రోగుల డేటాతో దీనిని నిర్ధారించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో సాధారణంగా వైద్యులు గమనించలేని సరికొత్త వేవ్‌ఫార్మ్ ప్యాటర్న్‌ను ఈ ఏఐ గుర్తించిందని ఇది వైద్య శాస్త్రానికి ఇప్పటివరకు తెలియని ఒక సరికొత్త జీవసంబంధిత క్లూ అని పేర్కొన్నారు.

**86 శాతం మందికి కొత్తగా గుర్తింపు:**

ప్రస్తుతం వైద్యులు గుండె పంపింగ్ సామర్థ్యాన్ని సూచించే LVEF ఆధారంగా గుండెపోటు ప్రమాదాన్ని అంచనా వేస్తున్నారు. అయితే సాధారణ LVEF ఉన్నవారిలో కూడా సడన్ కార్డియాక్ డెత్ సంభవిస్తున్నట్లు ఇప్పటికే పలు సందర్భాల్లో స్పష్టం అయింది. అయితే ఏఐ మాత్రం సంప్రదాయ పరీక్షలకు కనిపించని ప్రమాద సంకేతాలను కూడా గుర్తించగలిగిందని పరిశోధకులు తెలిపారు. ప్రస్తుత పద్ధతుల ప్రకారం గుండెపోటు ముప్పు 4.6 శాతంగా ఉంటే, ఈ ఏఐ ద్వారా గుర్తించిన రోగులలో వార్షిక ముప్పు 7 శాతం గా ఉన్నట్లు తేలింది ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాలతో పోలిస్తే ఇది 86 శాతం మంది అధిక ప్రమాదంలో ఉన్నవారిని అదనంగా గుర్తించగలిగిందని పరిశోధకులు వెల్లడించారు. సడన్ కార్డియాక్ డెత్‌ను నివారించేందుకు ఇప్పటికే ఇంప్లాంటబుల్ డిఫిబ్రిలేటర్లు అందుబాటులో ఉన్నాయి. కానీ అవి ఎవరికి అవసరమో ముందుగా గుర్తించడం కష్టంగా ఉండేది. ఈ విషయంలో ఏఐ కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు.

# ఎంపీ మల్లు రవిని కలిసిన నూతన డివిజన్‌అధ్యక్షులు

పార్టీ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తాం...
కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకాన్ని ప్రజలలోకి తీసుకెళ్తాం



**మేడిపల్లి,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నూతన డివిజన్ అధ్యక్షులుగా నియామకం అయిన సందర్బంగా టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మరియు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి ని మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ డివిజన్ అధ్యక్షులు బండి శ్రీరాములు కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులను ఎంపీ మల్లు రవి అభినందించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులు పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తామని, ప్రభుత్వం అమలు చేసే ప్రతి అభివృద్ధి పనిని ప్రజలలోకి తీసుకెళ్తామని,కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# పనులను త్వరితగతిన పూర్తి చేయాలి




**ములుగు,ఫ్లాష్ ఇండియా :** జిల్లాలో పూర్తయిన అభివృద్ధి పనులకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు ఉంటాయని, త్వరలోనే ముఖ్యమంత్రి జిల్లాకు రానున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో మొక్కలు నాటే విషయంలో అనుకున్న లక్ష్యాలను మించి మొక్కలు నాటాలని, అటవీ శాఖ అధికారులు విరిగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ బోర్కేడ్ హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డిఎఫ్ఓ వికాస్ మీనా, ఐటీడీఏ పీవో నవీన్ వత్సల్ టొప్పో లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన పల అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖ అధికారులు దృష్టి సారించాలని, అన్ని పనులు అనుకున్న సమయంలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో జిల్లాలోని అన్ని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసి గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్నారు.

**రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉండే విధంగా...**

జిల్లాలోని పలు చెరువులకు గోదావరి జలాలను తరలించడానికి ఏర్పాటు చేయనున్న పైప్ లైన్ల ఏర్పాటు పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అన్న నమస్తే ప్రస్తుత వ్యవసాయ సాగు సందర్భంగా రైతులకు యూరియా కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. భూముల సర్వేలను పూర్తి చేయడానికి అదనంగా సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. అభివృద్ధి విషయంలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉండే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. మేడారం అభివృద్ధి పనులు, పెండింగ్ పనులను 10 రోజుల్లో పూర్తి చేయాలని, త్వరలో సీఎం అనుముల రేవంత్ రెడ్డి మేడారం, ములుగు జిల్లాల్లో పర్యటించనున్నారని అన్నారు. జిల్లాలో 6 వేల కోట్ల రూపాయలతో పంచాయతీ రాజ్ శాఖ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని, సీఎం పర్యటన తేదీని త్వరలో ఖరారు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డిఓ కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి మరింత అభివృద్ధి

**ఎల్కతుర్తి,ఫ్లాష్ ఇండియా :** మండలం భవిష్యత్తులో అభివృద్ధిలో మరింత ముందంజలో నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి జంక్షన్ వద్ద మడిపల్లి నుండి ఎల్కతుర్తి జంక్షన్ వరకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ. 13 కోట్లతో చేపట్టిన బీటి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కుడా వైస్ చైర్పర్సన్ ఒ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీలతో కలసి సోమవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రహదారి నిర్మాణం పూర్తయితే గ్రామాలకు మండల కేంద్రానికి రహదారి అనుసంధానం (కనెక్టివిటీ) పెరుగుతుందన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రానికి కోర్టు, విద్యుత్ ఉపకేంద్రం, తహసీల్దార్ కార్యాలయాలు వస్తున్నాయన్నారు. తద్వారా ఎల్కతుర్తి మరింత అభివృద్ధిని భవిష్యత్తులో సాధిస్తుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రహదారి నిర్మాణానికి అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్డు నిర్మాణం కావాలని నాయకులు ప్రజాప్రతినిధులు ప్రజలు దృష్టికి తీసుకువచ్చారని, దీంతో రహదారి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రహదారి అభివృద్ధి పనులను త్వరగా పూర్తి కావాలని సూచించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ రహదారి నిర్మాణంతో కనెక్టివిటీ పెరిగి గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

**మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ కు ఘన నివాళులు**

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి స్వర్గీయ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సర్పంచ్ లావణ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, ఉప సర్పంచ్ రాజు, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, తహసిల్దార్ ప్రసాదరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీకి పక్షపాతం లేదు

**నాంపల్లి,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న కన్నెపల్లి పంప్ హౌస్ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తున్న వేళ ఈ పంప్ హౌస్ వినియోగంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. కన్నెపల్లి నుంచి నీటిని తీసుకువచ్చని ఇలాంటి సమయంలో భేషజాలకు పోవద్దని ఇప్పుడు కావాల్సింది విమర్శలు, ప్రతివిమర్శలు కాదని నీళ్లు కాలన్నారు. గత ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టు కాబట్టి దానిని ఆపరేట్ చేయొద్దనుకోవడం సరికాదన్నారు. కాళేశ్వరంపై విచారణ జరిపించండి. దోషులను శిక్షించండి కానీ ప్రజలను కాదని రైతులను శిక్షించే అధికారం రేవంత్ రెడ్డికి లేదన్నారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ స్టేట్ కార్యాలయంలో శ్యామాప్రసాద ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించిన ఈటల ఈ సందర్భంగా మాట్లాడారు.

**మూర్ఖంగా వ్యవహరించవద్దు:**

కాళేశ్వరంపై కమిటీలు, కమీషన్ల రూపంలో చర్చోపచర్చలు జరిగాయి అవి పక్కన పెడితే కన్నెపల్లిపై ఉన్న అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి డ్యాములు, పంప్ హౌస్లు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్లో 50 వేల క్యూసెక్కుల నీళ్లు వచ్చిన పంప్ హౌస్ లోపలికి నీళ్లు వస్తాయి. వాటిని పంప్ చేయవచ్చన్నారు. ఇప్పుడు లక్ష క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని వార్తలు వస్తున్నాయి.. మరోపక్క కరువు రాబోతుంది అనే వార్తలు కూడా వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఎవరిది తప్పు.. ఎవరు దుర్మార్గులు.. అని చర్చ పెట్టకుండా.. కోట్ల రూపాయలతో కట్టబడ్డ ప్రాజెక్టులను ఉపయోగించుకోవాలన్నారు. వర్షాలు లేక రైతు విత్తనాలు కూడా వేసుకోలేని పరిస్థితి ఉందని హైదరాబాదు లాంటి నగరాలు తాగే నీటి కోసం కృష్ణా గోదావరి మీదనే ఆధారపడి ఉన్నాయి. కాబట్టి నీళ్లను పంప్ చేయాలని డిమాండ్ చచేశారు. ప్రాజెక్టు కుంగిపోయింది, నీళ్లు నిలవనిది వాస్తవం. కానీ కన్నెపల్లి కెపాసిటీ 2 TMC లు అంటే ఇరవై ఐదు వేల క్యూసెక్కుల నీళ్లు వస్తే పని చేస్తాయి కాబట్టి వెంటనే పంపింగ్ మొదలు పెట్టాలన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలు అన్ని ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి విశాల దృక్పథంతో ఆలోచన చేయాలన్నారు.

**ఎప్పుడు ఎన్నికలొచ్చినా రేవంత్ కు ఓటమే:**

ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ఎప్పుడు ఎన్నికలొచ్చినా రేవంత్ ఓడిపోతాడని ప్రజలంటున్నారన్నారు. Ghmc ఎన్నికల్లో హైడ్రాకు మూల్యం చెల్లించుకోబోతున్నారు. రేవంత్ రెడ్డికి చాలా క్లారిటీ ఉందని ఆయన అమెరికా గడ్డమీద నిలబడి అబద్దాలు చెప్తేనే ప్రజలు ఇష్టపడతారు.. అబద్ధాలు చెప్పే నాయకులనే ప్రజలు బలపరుస్తారు అని చెప్పారు. దానికి పరాకాష్ట.. హైడ్రా అనే పదం నేను హిట్లర్ నుంచి తీసుకున్నాను అని ఆయన చెప్పడమే అన్నారు. దీన్ని బట్టే ఆయన నైజం అర్థం చేసుకోవాచ్చన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు పేదవాళ్లకు ఇంటి జాగాలను ఇళ్లను ఇచ్చారు. కానీ రేవంత్ రెడ్డి విధానం వేరు. పేదవాళ్ల ఇళ్లను కూలగొట్టడం, ఆనాటి ప్రభుత్వాలు ఇచ్చిన జాగాలు గుంజుకొని పెద్దవాళ్లకు అంటగట్టడమే ఆయన ఎజెండా అన్నారు. హిట్లర్ కు వారసత్వం అని చెప్పుకుంటున్న హైడ్రా ప్రజలకు న్యాయం చేస్తుందనుకోవడం మన తప్పు అన్నారు. నేను హైడ్రాను వ్యతిరేకించిన మొదట్లో చాలామంది ఈటల రాజేందర్ ఏంటి ఈ విధంగా చేస్తున్నారని ప్రశ్నించారు.. కానీ ఒంటరిగా నాలుగు నెలల పాటు కొట్లాడిన తర్వాత.. హైడ్రా నిజస్వరూపం అందరికీ తెలిసింది. ఇప్పుడు కోర్టు కూడా అదే చెప్పిందన్నారు. రంగనాథ్ నాకు ఏ చట్టంతో, కోర్టులతో సంబంధం లేదు. నన్ను ఎవరు నిలువరించలేరని చెప్పి ఆయన వ్యవహరిస్తున్న తీరుపట్ల కోర్టు కూడా అనేకసార్లు మందలించిందన్నారు.

**బీజేపీకి పక్షపాతం లేదు:**

కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి పక్షపాతం లేదని ఈటల అన్నారు. కావాలని దుర్మార్గమైన దుష్ప్రచారం చేస్తున్నారని మీడియా చేతిలో ఉందని పిచ్చి అబద్దాలు ప్రచారం చేయకండి అన్నారు. రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. మెట్రో త్వరగా మొదలుపెట్టాలన్నారు. శామీర్ పేట వైపు, మేడ్చల్ వైపు, ఎయిర్పోర్ట్ వైపు, ఫోర్త్ సిటీ వైపు మెట్రో వేయడానికి మేము వ్యతిరేకం కాదు.. కానీ పద్ధతి ప్రకారం చేయండి అని కోరుతున్నామన్నారు. ఫేస్ వన్ లో 13 వేల కోట్ల రూపాయలు, పేస్ టూ 40 వేల కోట్ల రూపాయలు కేంద్రం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. మెట్రో త్వరగా పూర్తి చేయడానికి భారతీయ జనతా పార్టీ ఎంపీలుగా, మంత్రులుగా పూర్తిస్థాయి సహకారం అందిస్తాము. ట్రిపుల్ ఆర్ రోడ్డు ఇచ్చింది కేంద్రం కాదా?

# కాళేశ్వరం పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలి..



**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** సిద్దిపేట వేదికగా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి లక్షల కోట్ల రూపాయల నిధులు వచ్చాయి కానీ, పేదవాడికి ఒక సొంత ఇల్లు కట్టించి ఇవ్వడానికి మాత్రం వారికి మనసు రాలేదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది వాళ్లే, దాన్ని ఓపెన్ చేసింది వాళ్లే, చివరకు అది కూలిపోయింది కూడా వాళ్ల హయాంలోనేనని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు వాళ్లే కాళేశ్వరం దగ్గరకు పోయి తామేదో చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచితే కింద ఉన్న ప్రాంతమంతా కొట్టుకుపోతుందని ఎన్డీఎస్ఏ హెచ్చరించినా, బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు.

**అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలి**

ప్రాజెక్టు కట్టినప్పుడు గత పాలకులకు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే కాళేశ్వరానికి ఈ గతి పట్టేది కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. కేవలం అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపడం ఆపాలని హితవు పలికారు. "కాళేశ్వరం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి (కేసీఆర్) ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలి. కాళేశ్వరాన్ని ఎలా కట్టారో సమాధానం చెప్పి.. తాము చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలి" అని సవాల్ విసిరారు. వారు ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదికగా చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ సభకు వచ్చి కాళేశ్వరంపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**తల తాకట్టు పెట్టి అయినా పేదల ఇళ్ల కల నెరవేరుస్తాం**

బీఆర్ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అసంపూర్తిగా కట్టి మధ్యలోనే వదిలేశారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వదిలేసిన ఆ అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్నింటినీ రిపేర్ చేసి త్వరలోనే పేదలకు అందిస్తామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తల తాకట్టు పెట్టి అయినా సరే, అర్హులైన ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే తమ ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు.

**ఫార్మా రంగంలో తెలంగాణకు మరో మైలురాయి..**

ములుగు: సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని బయోటెక్ పార్క్ ఫేజ్-III లో సిరో ఫార్మా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన అత్యాధునిక ఆంకాలజీ (క్యాన్సర్) ఔషధాల తయారీ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర తెలంగాణ ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం మండల నాయకుల నుండి పరిశోధన, ఉత్పత్తి విభాగాలను పరిశీలించి సంస్థ ప్రతినిధుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఫార్మా రంగంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, హైదరాబాద్ ప్రపంచ స్థాయి ఔషధ పరిశోధన, తయారీ కేంద్రంగా గుర్తింపు పొందిందన్నారు. ఆ గుర్తింపును మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు నూతన ఔషధ రంగంలో అభివృద్ధి, పరిశోధనలు అత్యంత అవసరమని, అందుకు సిరో ఫార్మా వంటి సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో తయారయ్యే నాణ్యమైన ఔషధాలు రోగులకు అందుబాటులోకి రావడం ద్వారా వైద్య రంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాల కల్పన లోనూ ఇటువంటి పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తాయని, రాష్ట్రంలో మరిన్ని ఔషధ పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మల్లేష్ గౌడ్, స్థానిక సర్పంచ్ కవిత నర్సింలు, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, పరిశ్రమ యొక్క చైర్మన్ గోవిందా రెడ్డి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి




**సూర్యాపేట,ఫ్లాష్ ఇండియా :** ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయిలో స్వీకరించే ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజలు సమర్పించిన వినతులను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణి సమావేశాలకు అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు అనవసర ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 76 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. వాటిలో భూ సమస్యలకు సంబంధించినవి 43, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శాఖకు సంబంధించినవి 5, మున్సిపాలిటీకి సంబంధించినవి 5, జిల్లా మహిళా సంక్షేమ శాఖ (డీడబ్ల్యూఓ)కు సంబంధించినవి 4, మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకు సంబంధించినవని తెలిపారు. అందిన అన్ని దరఖాస్తులను పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు పంపించినట్లు వెల్లడించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్ఓ ప్రేమ్‌రాజు, జడ్పీ సీఈఓ శిరీష, డీపీఓ యాదగిరి, డీఎంహెచ్ఓ డా. వెంకటరమణ, పీడీ హౌసింగ్ సిద్ధార్థ్, డీఎఫ్ఓ దామోదర్ రెడ్డి, సీపీఓ కిషన్, డీఈఓ అశోక్, సంక్షేమ అధికారులు నరసింహారావు, దయానంద రాణి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా..



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య చికిత్సలు పొందిన పేదల పక్షాన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా భరోసాగా నిలుస్తోందని కాంగ్రెస్ జిల్లా నాయకులు కొనియాడారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను సోమవారం ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, తదితరులు హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 300 మంది లబ్ధిదారులకు రూ. 88,78,600 మేరకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి, అభ్యున్నతికి విశేష కృషి జరుగుతుందని అన్నారు. ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి గారు ఎంతో శ్రద్ధ చూపి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో.. ప్రజలకు ఆరోగ్య లబ్ధి చేకూరేలా ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.

**లబ్ధిదారులకు భోజన సదుపాయం..**

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందేందుకు వచ్చిన లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి కల్పించారు. ఈ కార్యక్రమంలో.. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, సత్యనారాయణ రెడ్డి, నాయకులు కోసూరి శ్రీను, మల్లెల నాగేశ్వరరావు, ఓబీసీ రాష్ట్ర నేత హారిక నాయుడు, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు కొర్లపాటి అన్నపూర్ణ, శ్రీ కళా రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ అనుబంధ నాయకులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంపాదకీయం

# భవిష్యత్తు బలిపీఠమే!



విద్య అనేది సమాజ అభివృద్ధికి పునాది. ఒక దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందనే మాట యథార్థం. అలాంటి విద్యను సేవగా కాకుండా లాభదాయక వ్యాపారంగా మార్చే ధోరణి రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నారాయణపేట జిల్లాలో ప్రైవేటు పాఠశాలల నిర్వహణ తీరు చూస్తే ఈ పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారిందో స్పష్టమవుతోంది. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా, విద్యా హక్కు చట్టాన్ని పక్కనబెట్టి, విద్యార్థుల భవిష్యత్తు కంటే ఆదాయానికే ప్రాధాన్యం ఇస్తున్న కొన్ని ప్రైవేటు పాఠశాలల వ్యవహారం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. దీనికితోడు పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) ప్రకారం ప్రతి ప్రైవేటు పాఠశాలలో పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించడం తప్పనిసరి. ఈ చట్టం వెనుక ఉద్దేశం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు కూడా నాణ్యమైన విద్య అందించడమే. కానీ జిల్లాలో ఈ నిబంధన అమలవుతున్న పరిస్థితి కనిపించడం లేదు. ఉచిత సీట్లను ఇవ్వకుండా పలు రకాల సాకులు చెప్పడం, సమాచారం వెల్లడించకపోవడం, తల్లిదండ్రులను నిరుత్సాహపరచడం వంటి చర్యలు చట్టం స్ఫూర్తినే దెబ్బతీస్తున్నాయి. పేద కుటుంబాలకు విద్య అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యం కాగితాలకే పరిమితమవుతోంది.ఇదే సమయంలో అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, షూస్, స్కూల్ బ్యాగులు, ప్రత్యేక కోచింగ్, యాక్టివిటీ ఫీజులు వంటి పేర్లతో ఇష్టానుసారంగా భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు నియంత్రణ విధానాన్ని పట్టించుకోకుండా యాజమాన్యాలు తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుంటున్నాయి. తమ పిల్లలకు మంచి విద్య అందించాలనే ఆశతో అప్పులు చేసి అయినా ఫీజులు చెల్లించే పరిస్థితికి అనేక కుటుంబాలు చేరుకున్నాయి. ఇప్పటికే కరువు, ఉపాధి కొరత, వలసలతో ఇబ్బందులు పడుతున్న నారాయణపేట వంటి జిల్లాలో ఈ ఆర్థిక భారం మరింత తీవ్రమవుతోంది.విద్యా నాణ్యత విషయంలోనూ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న కొన్ని పాఠశాలలు, తక్కువ జీతాలతో అనుభవం లేని యువతను ఉపాధ్యాయులుగా నియమించుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. టీటీసీ, బీఈడీ వంటి అర్హతలు లేకుండానే బోధన బాధ్యతలు అప్పగించడం విద్యా ప్రమాణాలను దెబ్బతీస్తోంది. ముఖ్యంగా ఇంగ్లీష్ మాధ్యమ పాఠశాలలుగా ప్రచారం చేసుకుంటూ, ఇంగ్లీష్‌పై సరైన పట్టు లేని సిబ్బందిని నియమించడం వల్ల విద్యార్థుల ప్రాథమిక అవగాహన కూడా దెబ్బతింటోంది. విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక మార్కెట్‌లో లభించే గైడ్స్ ఆధారంగా బోధన కొనసాగించడం ఆందోళన కలిగించే అంశం. బోధన అంటే పుస్తకాన్ని చదవడం మాత్రమే కాదు; విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, విశ్లేషణ సామర్థ్యం, సృజనాత్మకతను పెంపొందించడం కూడా ఉపాధ్యాయుడి బాధ్యత.అయితే సమస్య కేవలం బోధనతోనే ముగియడం లేదు. అనేక పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవనే ఆరోపణలు ఉన్నాయి. పిల్లలకు అవసరమైన విశాలమైన ఆటస్థలాలు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, భద్రతా ప్రమాణాలు లేకుండానే పాఠశాలలు నడుస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. అగ్నిప్రమాదాలు, ఇతర ప్రమాదాలు సంభవించినప్పుడు పిల్లల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశాలను విస్మరించలేం. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీకి తావు ఉండకూడదు.ప్రతి పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ ఏర్పాటు చేసి నిరంతరం సమావేశాలు నిర్వహించాలని నిబంధనలు స్పష్టంగా పేర్కొంటున్నాయి. ఈ కమిటీలు ఫీజులు, బోధన, విద్యార్థుల సంక్షేమం వంటి అంశాలపై పర్యవేక్షణ చేయాలి. కానీ చాలా చోట్ల ఈ కమిటీలు కేవలం పేరుకే ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. తల్లిదండ్రుల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా యాజమాన్యాలు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం పారదర్శకతకు విరుద్ధం.ఇంతటి పరిస్థితి కొనసాగుతున్నా పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు చురుకుదనం ప్రదర్శించడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లాలో వందకు పైగా ప్రైవేటు పాఠశాలలు ఉన్నప్పటికీ క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం లేదని, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సైన్స్ ఫెయిర్ వంటి కార్యక్రమాల పేరుతో ప్రైవేటు పాఠశాలల నుంచి వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో అధికారుల వైఖరిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవం లేకపోయినా, ప్రజల్లో అలాంటి అభిప్రాయం ఏర్పడకుండా విద్యాశాఖ మరింత పారదర్శకంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉంది.ప్రభుత్వం ఇప్పటికే ప్రైవేటు పాఠశాలల నిర్వహణకు స్పష్టమైన నిబంధనలు రూపొందించింది. ఫీజుల నియంత్రణ, అర్హత కలిగిన ఉపాధ్యాయుల నియామకం, విద్యార్థుల భద్రత, విద్యా హక్కు చట్టం అమలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది. ఇప్పుడు అవసరమైనది ఆ నిబంధనలను కఠినంగా అమలు చేయడమే. ప్రతి పాఠశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, లోపాలను బహిరంగంగా వెల్లడించి, చట్టాన్ని ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై జరిమానాలు, గుర్తింపు రద్దు వంటి చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన విద్య అందిస్తున్న పాఠశాలలను ప్రోత్సహించడం కూడా అవసరం.విద్య అనేది కేవలం మార్కులు సాధించే ప్రక్రియ కాదు. అది సమాజాన్ని నిర్మించే శక్తి. అలాంటి పవిత్రమైన రంగాన్ని లాభాల కేంద్రంగా మార్చే ప్రయత్నాలు కొనసాగితే భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. విద్యార్థుల హక్కులను కాపాడటం, తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం, నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులో ఉంచడం ప్రభుత్వంతో పాటు సమాజం మొత్తానికి ఉన్న బాధ్యత. నారాయణపేట జిల్లాలో ప్రైవేటు పాఠశాలలపై వినిపిస్తున్న ఆరోపణలు కేవలం ఒక జిల్లా సమస్యగా కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా విద్యా వ్యవస్థను పునఃపరిశీలించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు అప్రమత్తమై కఠిన చర్యలు తీసుకుంటేనే విద్యపై ప్రజల విశ్వాసం నిలబెట్టగలుగుతారు. లేకపోతే విద్య వ్యాపారమవుతుంది... విద్యార్థుల భవిష్యత్తు బలిపీఠమవుతుంది.



# మాన్సూన్ సెషన్ కీలకం కాబోతుందా..?

2029 ఎన్నికల కోసం అటు జాతీయస్థాయిలో.. ఇటు రాష్ట్రస్థాయిలో కీలక కసరత్తు జరుగుతోంది. ఈ నెల 21 నుంచి జరిగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్రానికి కీలక అజెండా ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లును కూడా ఆమోదింపజేసుకోవటానికి ఇప్పటికే ఎంపీలను కూడగడుతోంది. పనిలోపనిగా పునర్విభజన చట్టం ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో సీట్ల పెంపు లాంఛనమేనని ఇక్కడి పార్టీలు అంచనాలు పెట్టుకున్నాయి. ఇందుకు అనుగుణంగా ఏపీలో ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయి కసరత్తు మొదలుపెట్టాయి. తెలంగాణలో హైదరాబాద్‌లో పెరిగే సీట్లే కీలకం కానున్న తరుణంలో.. ఇక్కడ పట్టు పెంచుకునే పార్టీకి అడ్వాంటేజ్ వస్తుందని అంచనా. బెంగాల్ ఎన్నికల్లో గెలుపు తర్వాత బీజేపీ.. జాతీయస్థాయిలో తన వ్యూహాలకు వేగంగా పదును పెడుతోంది. ముఖ్యంగా మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లుల్ని నెగ్గించుకోవాలనే పట్టుదలతో కనిపిస్తోంది. ఇప్పటికే ఎంపీల బలం కూడగట్టిన బీజేపీ.. ఈ అజెండాకు ఆమోదముద్ర వేసుకుని.. వచ్చే ఎన్నికలకు సన్నద్ధం కావాలనే వ్యూహంతో ఉంది.ఒక్కో ఎన్నికకు ఒక్కో వ్యూహం అనుసరిస్తూ.. గత పన్నెండేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ.. ఇప్పుడు వచ్చే ఎన్నికల కోసం పకడ్బందీ కసరత్తుకు రంగం సిద్ధం చేసింది. ఈ నెల 21 నుంచి మొదలయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్ని దానికి వేదికగా ఎంచుకుంది. ఈసారి పార్లమెంట్ సెషన్ కోసం కేంద్రం ఇప్పటికే కీలక అజెండాను రెడీ చేసింది. గతంలో చేదు అనుభవం ఎదురైన మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లుల్ని ఈసారి ఎలాగైనా ఆమోదింపజేసుకోవాలనే లక్ష్యంతో ఉంది. అందుకోసం ఇప్పటికే కావాల్సిన సంఖ్యాబలాన్ని కూడగడుతోంది. ఈ రెండు బిల్లుల ఆమోదానికీ, వచ్చే ఎన్నికల సన్నద్ధతకూ విడదీయలేని సంబంధం ఉండటంతో.. ఈసారి ఎలాగైనా బిల్లులు గట్టెక్కి తీరాలని బీజేపీ పట్టుదలతో కనిపిస్తోంది. అందుకే ఎందుకైనా మంచిదని ప్లాన్ ఏతో పాటు ప్లాన్ బీని కూడా సిద్ధం చేసుకుందని అంటున్నారు. ఇంకా అవసరమైతే ప్రతిపక్షానికి పార్లమెంట్ సాక్షిగా మరిన్ని షాకులకూ వ్యూహాలు రచిస్తోంది. ఈసారి జమిలి ఎన్నికలు జరుగుతాయనే అంచనాలు ఉండటంతో.. ఎన్నికల వ్యూహరచనకు ఎక్కువ సమయం తీసుకోకుండా.. అనుకున్న వ్యూహాలు అనుకున్నట్టుగా అమలు కావాలంటే.. ఈ రెండు బిల్లులు గట్టెక్కడం కీలకమనేది బీజేపీ వేసుకుంటున్న రాజకీయ లెక్క.ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతానికి డీలిమిటేషన్ విషయంలో ఎంపీ స్థానాలకే పరిమితమైనా.. ఏపీ, తెలంగాణను ప్రత్యేక కేసుగా చూడక తప్పదు. అలా చూసినప్పుడు పునర్విభజన చట్టం ప్రకారం.. ఏపీలో అసెంబ్లీ సీట్లు 175 నుంచి 225కి, తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 119 నుంచి 153 పెరుగుతాయని చెబుతున్నారు. ఒకవేళ కేంద్రం ప్రతిపాదించిన యాభై శాతం పెంపు ఫార్ములాను అప్లై చేస్తే.. ఏపీలో అసెంబ్లీ సీట్లు 175 నుంచి 262 లేదా 263కు పెరుగుతాయి. అదే తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 119 నుంచి 178 లేదా 179కి పెరుగుతాయి. ఈ రెండు రాష్ట్రాల్లో సీట్ల పెంపుకు ఎవరూ అభ్యంతర పెట్టే అవకాశాల్లేకపోవడంతో.. ఈ పని కూడా పూర్తైపోతుందని రాజకీయ వర్గాలు లెక్కలేస్తున్నాయి.నిజానికి బెంగాల్ ఎన్నికల ఫలితాలు వచ్చిన దగ్గర్నుంచీ బీజేపీ పొలిటికల్ గేర్ మార్చింది. ఇకపై నాన్చుడు బేరానికి తావు లేదని, అనుకున్న పని అయిపోవాల్సిందేననే వేగిరపాటుతో కనిపిస్తోంది. పార్లమెంట్‌లో అనుకున్న అజెండా అమలుకు సంఖ్యాబలం అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో అవసరానికి మించిన ఎంపీల బలం సేకరిస్తోంది. ఇప్పటికే టీఎంసీ, శివసేన ఉద్ధవ్ థాక్రే ఎంపీలు పరోక్షంగా ఎన్డీఏకు మద్దతు పలికేలా చేసుకుంది. ఇంతటితో ఆగకుండా యూపీలో సమాజ్ వాదీ పార్టీ, ఒడిషాలో బిజూ జనతాదళ్ పార్టీ నుంచి కూడా బలం కూడగట్టే పనిలో పడింది. చివరకు తమిళనాడులో డీఎంకేతో కూడా లోపాయికారీ డీల్ చేసుకుంటున్నారనే చర్చ గట్టిగా జరుగుతోంది. కేవలం ప్రధాన పార్టీలే కాకుండా చిన్న పార్టీలు, ఇండిపెండెంట్లు.. కారెవరూ సంప్రదింపులకు అనర్హం అనే రీతిలో హస్తినలో నంబర్ గేమ్ నడుస్తోంది. ఇందుకోసం బీజేపీ కీలక నేతలు రంగంలోకి దిగారంటే.. ఆ పార్టీ ఈ విషయాన్ని ఎంత సీరియస్‌గా తీసుకుంటుందో అర్థం చేసుకోవచ్చు.పార్లమెంట్ కు కేంద్రం ఇప్పటికే ఓ అజెండా అనుకుంది. దాని కోసం కసరత్తు వేగంగా పూర్తిచేస్తోంది. కానీ ఇప్పుడు కూడగడుతున్న సంఖ్యాబలం చూస్తే.. కేవలం అనుకున్న అజెండాతో ఆగుతారా.. లేదంటే దేశాన్ని ఆశ్చర్యపరిచేలా మరో కీలక నిర్ణయం తీసుకుంటారా అనే అనుమానాలూ లేకపోలేదు. ఆమాటకొస్తే యూనిఫామ్ సివిల్ కోడ్ ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉంది. ఇప్పటికే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దశల వారీగా అమలౌతున్న యూసీసీని.. ఈసారి పార్లమెంట్ సెషన్‌లో పెట్టేసి.. అందరికీ షాకిస్తారా.. లేదా అనేది మరో ఆసక్తికర చర్చ. కానీ ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదని, ఇంతకు మించి దేశం మొత్తం భావోద్వేగంతో కనెక్ట్ అయ్యే పని ఏదో చేస్తారని, దానికి సంబంధించిన హింట్ పార్లమెంట్ వేదికగా ఇస్తారనేది రాజకీయ వర్గాల అభిప్రాయంగా ఉంది. అంతేకాదు నీట్, అయోధ్య అంశాలతో ఇరుకునపడ్డ కేంద్రం.. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా.. డ్యామేజ్ కంట్రోల్‌కు కూడా దిగుతుందనే అంచనాలున్నాయి. అసలివేమీ కాకుండా.. ఎవరి ఊహకూ అందని, అందరూ చర్చించుకునేలా ఇతర అంశాలను ఏమైనా ముందుకుతెస్తారా అనేది చూడాల్సి ఉంది.ఏతావాతా ఒకటి మాత్రం పక్కా. వచ్చే ఎన్నికలకు పార్లమెంట్ మాన్‌సూన్ సెషన్‌లోనే అజెండా సెట్ అవుతుంది. ఎన్నికల సన్నద్ధతను అధికార పక్షం దాదాపుగా పూర్తిచేస్తుంది. అందుకు అవసరమైన అన్ని పనులూ చేస్తోంది. అవసరమైతే సెషన్‌ను పొడిగిస్తారనే చర్చ కూడా లేకపోలేదు.అటు బీజేపీలో కూడా ఈసారి పార్లమెంట్ సెషన్లో జరిగే పనులపై రకరకాల అభిప్రాయాలున్నాయి. కీలక విషయాలు అగ్రనేతలకు మినహా మిగతావారికి తెలిసే అవకాశం లేకపోవడంతో.. ఎవరికి తోచినట్టుగా వారు ఊహాగానాలు చేస్తున్నారు. కొందరు నేతలైతే మరో అడుగు ముందుకేసి.. ఏవో లీకులిచ్చి మరింత కన్ఫ్యూజ్ చేసే ప్రయత్నం కూడా చేస్తున్నారు. ఏదేమైనా ఇప్పటికే ప్రధానిగా పలు రికార్డులు బద్దలు కొట్టిన మోడీ.. ఈసారి ఎన్నికల్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే బీజేపీ కసరత్తు చేస్తున్న విషయం ఇప్పటికే స్పష్టమైంది. ఈసారి ఎన్నికల్లో గట్టెక్కితే.. ఇక కేంద్రంలో ఎదురుండదనే ఉద్దేశంతో బీజేపీ కనిపిస్తోంది. ఇందుకు తగ్గట్టుగా ప్రతిపక్షాలు కూడా కాషాయ పార్టీకి బ్రేకులేయాలనే ప్రయత్నాలు చేయడం.. ఆ పార్టీలో మరింత కసిని పెంచుతోందనే చర్చ కూడా జరుగుతోంది.ఆమాటకొస్తే.. వచ్చే ఎన్నికల అజెండా గత పార్లమెంట్ సమావేశాల్లోనే పూర్తి కావాల్సింది. కానీ ప్రతిపక్షాలు తొలిసారి ఏకతాటిపైకి వచ్చి.. అధికార పక్షానికి అస్సలు ఛాన్స్ ఇవ్వకుండా.. మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లుల్ని విజయవంతంగా అడ్డుకున్నాయి. ఊహించని ఈ పరిణామంతో బీజేపీ కూడా కొంత వెనకడుగు వేసింది. కానీ మొన్నటి ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఆశాజనకమైన ఫలితాలు రావడంతో.. కాషాయ పార్టీకి మళ్లీ ఊపొచ్చింది. ఇదే జోష్‌లో పార్లమెంట్‌లో వ్యూహాలు పక్కాగా అమలుచేయాలని స్కెచ్ గీస్తోంది.అన్నింటికీ మించి కేంద్రంలో బలమైన సర్కారు అని చెప్పుకోవాలంటే.. పార్లమెంట్‌లోనూ ఆధిపత్యం ప్రదర్శించటం అత్యవసరం. మొన్నటిదాకా పార్లమెంట్‌లో అనుకున్నట్టుగా వ్యూహాలు అమలుచేసిన బీజేపీ.. ప్రతిపక్షాల్ని కూడా విజయవంతంగా చీకాకు పెట్టగలిగింది. కానీ ఇటీవల ముగిసిన సెషన్ మాత్రం అధికార పక్షానికి చేదు అనుభవం మిగిల్చింది. ఈ మరకను చెరిపేసుకోవడంతో పాటు.. పార్లమెంట్‌లో తనకు తిరుగులేదని చాటుకోవడం కూడా అధికార పక్షానికి ఎన్నికల ముందు కీలకంగా మారింది. అందుకే ఈ ఒక్క సెషన్‌లో అన్ని లెక్కలూ సరిచేయాలనే సంకల్పం బీజేపీలో కనిపిస్తోంది. అంతేకాదు తద్వారా ఒక్కసారి అనుకున్న పనిని ఎన్ని అవాంతరాలు వచ్చినా చేసి తీరతామనే సంకేతాలు దేశ ప్రజలకు ఇవ్వడంతో పాటు.. వచ్చే ఎన్నికల్లో కూడా బీజేపీకి తిరుగుండదనే మానసిక భావనను సొంత పార్టీ నేతలు, క్యాడర్‌కు ఇవ్వడమే లక్ష్యంగా కీలక కసరత్తు జరుగుతోంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# కాస్ట్‌లీ ఫోన్ల కలకలం..

**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన కరీంనగర్ నగర పాలక సంస్థ.. పాలకులు మారిన ప్రతి సారి పంథాను మార్చుకుంటూ అవినీతి అక్రమాలను యథేచ్ఛగా సాగించేందుకు మరో అడుగు ముందుకు వేస్తూనే ఉంది.. అందుకు ఎప్పటికప్పుడు పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వ్యూహాలను అమలు చేస్తుంది అనే అభిప్రాయాలు నగరంలో వ్యక్తమవుతున్నాయి. గతంలో అడుగడుగునా నగరపాలక సంస్థలో అక్రమాలపై విమర్శలు వ్యక్తమవ్వగా ఈ సారి పాలక వర్గంలో నగర ప్రజలు నూతన కార్పొరేటర్లకు అవకాశం కల్పించారు. నూతనంగా ఎన్నుకోబడ్డ కార్పొరేటర్లు సైతం అవినీతి అక్రమాలను కడిగి పారేసెందుకు కుతూహలంతో ఉన్న వారి సంఖ్య ఎక్కువే. దీంతో పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టిన నగరపాలక సంస్థ కాస్లీ ఫోన్ స్కెచ్ కు శ్రీకారం చుట్టడం ఇప్పుడు నగరం లో చర్చానీయాంశంగా మారింది.

**కార్పొరేటర్లకు కాస్ట్‌లీ ఫోన్...**

కరీంనగర్ నగర పాలక సంస్థ పాలన సౌలభ్యం కోసం కార్పొరేటర్లకు ఫోన్ లు అందించాలనే ఆలోచన అభినందనీయమే. కానీ కాస్ట్‌లీ ఫోన్ అనే అంశం అభ్యంతరాలకు ఆజ్యం పోస్తుంది. గతంలో ఫోన్ నంబర్ల సిమ్ కార్డులు అందించి ఫోన్ బిల్లులు చెల్లించిన ఆనవాయితీని కొనసాగించిన నగరపాలక సంస్థ ఇప్పుడు ఒక్కడుగు ముందుకు వేసి ఫోన్ లు కోనుగోలు చేయాలి అనే ఆలోచనకు రావడం వివాదస్పదంగా మారింది. అదికూడా రూ.40 వేల పై చిలుకు ధర పలికే ఫోన్లు ఇవ్వాలని నిర్ణయించడం వివాదానికి కారణమవుతుంది. అయితే ఈ నిర్ణయాన్ని కొంత మంది కార్పొరేటర్లు వ్యతిరేకించినప్పటికి అధిక సంఖ్యలో కార్పొరేటర్లు అనుకూలంగా ఉండటంతో ఫోన్లు కొనుగోలు చేసేందుకు బడ్జెట్ ను కేటాయించిన నగరపాలక సంస్థ అందుకు టెండర్లను సైతం పిలిచింది. అయితే ఇప్పుడు ఈ కాస్ట్‌లీ ఫోన్ల వివాదం నగరపాలక సంస్థలో అంతర్గతంగా దుమారం లేపుతుంది


**66మంది కార్పొరేటర్లు 70 ఫోన్లు**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిదిలో నూతనంగా విలీనం అయిన గ్రామాలతో కలసి మొత్తం 66 మంది కార్పొరేటర్లు నూతనంగా ఎన్నికై పాలకవర్గంలో ఉన్నారు. అయితే నగరపాలక సంస్థ 70 ఫోన్లు కొనుగోలు చేసేందుకు టెండర్లను పిలిచింది. అయితే మిగత నాలుగు ఫోన్లు ఎవరికోసం అనేది చర్చ జరుగుతుండగా కోఆప్షన్ సభ్యులు అనే చర్చ జరుగుతున్నప్పటికీ కోఆప్షన్ సభ్యులు 5 గురు ఉండటం తో మొత్తం పాలకవర్గం సంఖ్య 71 కి చేరుతుంది. దీంతో ఆ 4 ఫోన్లు ఎవరికోసం అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి

**కాస్ట్‌లీ ఫోన్ తో కార్పొరేటర్ల కట్టడి ?**

కరీంనగర్ నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి పాతుకుపోతున్న పాలకవర్గ సభ్యులతో కార్పొరేషన్ మొత్తం అవినీతి అక్రమాలకు నిలయంగా మారుతుంది అనే విమర్శలు వ్యక్తం కావడంతో ఓటర్లు తాజాగా జరిగిన ఎన్నికల్లో అధిక శాతం కొత్తవారికి మొగ్గు చూపి పాలకవర్గంలోకి పంపించారు. దీంతో సుమారుగా 11 మంది మినహా మిగతా కార్పొరేటర్లు అందరూ కొత్తవారే కావడం తో జనంలో పారదర్శకంగా పాలన సాగుతుంది అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న తరుణంలో మున్సిపల్ కార్పొరేషన్ కాస్ట్‌లీ ఫోన్ల భాగోతానికి టెండర్లు పిలవడం తో అక్రమాలపై ప్రశ్నించే కుతూహలంతో ఉన్న కార్పొరేటర్లను కట్టడిచేసేందుకే అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే గడచిన రెండు సమావేశాల్లో ఒక్కసారి పరిచయాలు పాలన విధానం పై చర్చ జరగ్గా రెండవ సారి ప్రజల సమస్యలపై విజ్ఞప్తులు అభ్యంతరాలతో సమావేశం ముగినట్టు తెలుస్తుంది. భవిష్యత్ లో పాలకవర్గ సభ్యులు అక్రమాలపై అభ్యంతరాలు తెలుపకుండా దారికి తెచ్చుకునే క్రమంలో కార్పొరేషన్ అధికారులు కాస్ట్‌లీ ఫోన్ తో కట్టడి చేసే చర్యలకు శ్రీకారం చుట్టినట్లు నగరంలో చర్చ జోరందుకుంది. అయితే పాలకవర్గం కాలం ముగిశాక పాలకవర్గ సభ్యులు ఫోన్లు అప్పగించి నో డ్యూ సర్టిఫికెట్ తీసుకునే ఆనవాయితీ ఉన్నప్పటికీ నగరంలో జనం అమలుకునోచుకోని పాలకుల హామీలు పరిష్కారానికి నోచుకోని సమస్యలతో సతమతమవుతున్న ఈ సమయంలో లక్షల రూపాయలు వెచ్చించి ఫోన్లు కోనుగోలు చేయడం అవసరమా? అనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఒక వేల ఫోన్ తప్పని సరి అనుకుంటే ఆ స్థాయిలో ధరపెట్టి కోనుగోలు చేసే కంటే అంతకన్న తక్కువదరలో ఆన్ రైడ్ ఫోన్లు అందుబాటులో ఉన్నాయి కదా అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి

## నాంపల్లి కోర్టులో భారీ అగ్ని ప్రమాదం..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మహానగరంలో ఇటీవలి కాలంలో వరుస అగ్ని ప్రమాదాలు గుబులు పుట్టిస్తున్నాయి. తాజాగా అత్యంత రద్దీగా ఉండే నాంపల్లి క్రిమినల్ కోర్టు ప్రాంగణంలో అర్ధరాత్రి దాటాక భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. కోర్టు ప్రధాన భవనంలోని మూడో ఫ్లోర్‌లోని ఓ గదిలో ఉన్నట్లుండి మంటలు ఎగసిపడటంతో ఆ పరిసరాల్లో కలకలం రేపింది.స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట సమయంలో నాంపల్లి కోర్టు మూడో అంతస్తులోని ఒక గది నుంచి దట్టమైన పొగలు, మంటలు బయటకు రావడాన్ని అక్కడే భద్రతా సిబ్బంది గమనించారు. వెంటనే వారు ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం వెంటనే రెండు ఫైరింజన్లతో వారు స్పాట్‌కు చేరుకుని చేరుకున్నారు. మంటలు పక్కన ఉన్న ఇతర గదులకు, కోర్టు రికార్డు రూమ్‌లకు వ్యాపించకుండా సిబ్బంది సకాలంలో స్పందించి, తీవ్రంగా శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. అర్ధరాత్రి సమయం కావడంతో కోర్టులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, గదిలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో కోర్టుకు సంబంధించిన ఏవైనా కీలకమైన పత్రాలు, ఫైళ్లు ఏమైనా కాలిబూడదయ్యాయ అనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది.



# లగ్జరీ రిసార్టులో మొత్తం 52 మంది అరెస్ట్

**ఉత్తరాఖండ్ :** ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ ప్రవేశ ద్వారమైన రామ్‌నగర్ లోని ఓ ప్రముఖ లగ్జరీ రిసార్ట్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను పోలీసులు గుట్టురట్టు చేశారు. టూరిజం ముసుగులో నిర్వహిస్తున్న ఓ భారీ సెక్స్ రాకెట్, రేవ్ పార్టీపై యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ , స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ , రామ్‌నగర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా మెరుపు దాడులు చేశారు. ఈ ఆపరేషన్‌లో ఏకంగా 52 మందిని అరెస్ట్ చేయగా, ఓ మైనర్ బాలికతో సహా 10 మంది మహిళలను అధికారులు రక్షించారు.

**నోట్ల వర్షం.. అశ్లీల నృత్యాలు**

అయితే, విశ్వసనీయ సమాచారం ప్రకారం ఇతర రాష్ట్రాల నుంచి అందంగా ఉన్న అమ్మాయిలు, విదేశీ మహిళలను రిసార్టుకు రప్పించి వారితో వ్యభిచారం నడుపుతున్నారు. పోలీసులు దాడి చేసిన సమయంలో అక్కడ లిక్కర్ పార్టీ జరుగుతోంది. మహిళలతో అశ్లీల నృత్యాలు చేయిస్తూ, అక్కడకు వచ్చిన విటులు సదరు మహిళపై విచ్చలవిడిగా నోట్ల వర్షం కురిపిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలం నుంచి భారీగా అభ్యంతరకర సామగ్రితో పాటు లిక్విండ్ క్యాష్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ సెక్స్ రాకెట్‌కు సూత్రధారి ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన పెస్టిసైడ్స్ వ్యాపారవేత్త ఉమేంద్ర కుమార్‌గా తేలింది. తన బిజినెస్ అసోసియేట్స్ కోసం జూలై 4, 5 తేదీల్లో దాదాపు రూ.2.20 లక్షలు చెల్లించి లగ్జరీ రిసార్ట్‌ను బుక్ చేసినట్లుగా విచారణలో అంగీకరించాడు. పార్టీకి అటెండ్ అయిన ప్రతి మహిళకు రూ.10 వేల చొప్పున రేటు ఫిక్స్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు.

**నిందితులపై పోక్సో సహా కేసులు నమోదు..**

కాగా, ఈ తంతులో రిసార్ట్ యాజమాన్యం కూడా భాగస్వామి అయినట్లుగా తెలుస్తోంది. రిసార్ట్ జనరల్ మేనేజర్, అక్కడకు వచ్చే విటుల పేర్లను కానీ, మహిళల వివరాలను
కానీ విజిటర్స్ రిజిస్టర్‌లో నమోదు చేయవద్దని సిబ్బందిని ఆదేశించినట్లుగా విచారణలో తేలింది. సాక్ష్యాలను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసేందుకు ప్రయత్నించినందుకు గానూ పోలీసులు సదరు లగ్జరీ రిసార్ట్‌ను పూర్తిగా సీజ్ చేశారు. అదేవిధంగా నిందితులపై బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం వ్యభిచార నిరోధక చట్టం, పోక్సో చట్టం, ఎక్సైజ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు.

# టాప్ ఫ్లోర్‌లో నిలిచిన ఫుడ్ సప్లై!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో అధికారానికి కేంద్రమైన సచివాలయం, అందునా ఆరో అంతస్తు.. సాక్షాత్తూ సీఎం ఆఫీస్ ఉండే చోటా ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఫలితంగా అక్కడి ఉద్యోగులు, సిబ్బందికి సరఫరా చేసే భోజనాలకు బిల్లులు చెల్లించకపోవడంతో సరఫరా నిలిచిపోయినట్టు తెలిసింది. ఎవరిని అడిగినా ప్రయోజనం లేకపోవడం, ఒకరిపైఒకరు నెపం నెట్టేసుకుంటూ తప్పించుకునే ఆరోపణలు చేస్తుండటంతో చేసేది ఏమీలేక కాంట్రాక్టర్ సెక్రెటేరియట్‌లోని ఆరో అంతస్తుకు భోజనం సప్లయ్‌ను నిలిపివేసి వేసినట్టు సమాచారం.

**సీఎం, సీఎస్ అక్కడే విధులు..**

సచివాలయంలోని ఆరో అంతస్తులో ముఖ్యమంత్రి, సీఎస్ సహా సీఎంవో సీనియర్ ఐఏఎస్అధికారులు అక్కడి నుంచే విధులు నిర్వర్తిస్తుంటారు. వీరి షేషిల్లో పనిచేసే అధికారులు, కిందిస్థాయి సిబ్బంది ఉదయం నుంచి రాత్రివరకూ కొందరు ఏదో ఒక పని చేస్తూనే ఉండాల్సి వస్తుంది. ఏ సమయంలో ఏ రకమైన సమాచారం, లెక్కలు, లేఖలు రాయడం, ఇతర కీలకమైన సమాచారం కోసం వీరు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. దీంతో వీరి సౌకర్యార్థం ప్రతి రోజూ ఉదయం టీ, టిఫిన్స్, మధ్యాహ్నం భోజనాలు, సాయంత్రం స్నాక్స్ అందిస్తుంటారు. ఒక్కోసారి అవసరమైతే రాత్రి ఫుడ్ కూడా అందిస్తుంటారు. వీరిందరికీ అవసరమైన టిఫిన్స్, భోజనాలు సరఫరా చేసే కాంట్రాక్టర్ సచివాలయం సమీపంలోనే వంటలు వండి సరఫరా చేస్తుంటారు. పూర్తిగా శాఖాహార భోజనాన్ని అందిస్తుంటారు.

**రెండేండ్లుగా బకాయిలు..**

కాంట్రాక్టురుకు గత రెండేండ్లుగా బిల్లులు చెల్లించలేదని సచివాలయ ఉద్యోగ వర్గాల ద్వారా తెలిసింది. మొత్తం ఆరో ఫ్లోర్‌లో వందల సంఖ్యలో ఉండే చిన్న పెద్ద ఉద్యోగులు అందరూ కలిసి వందల సంఖ్యలో ఉంటారు. వారికి రెండేండ్లుగా భోజనాలు, టిఫిన్స్, స్నాక్స్ అందించడం వలన బిల్లులు రూ. కోట్లకు చేరుకున్నాయని సమాచారం. బిల్లులు చెల్లించాలని సదరు కాంట్రాక్టర్ ఎన్నిసార్లు అడిగినా ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి స్పందన కరువైందని విశ్వసనీయవర్గాల సమాచారం. తాను వంట సరుకులు తెచ్చుకోవాలి, విడతల వారీగా అయినా కొద్ది మొత్తంలో బిల్లులు విడుదల చేయాలని కాంట్రాక్టర్ మొరపెట్టుకున్నా ఫలితం లేదని తెలిసింది. అధికారులు ఒకరిపైఒకరు నెపం వేసుకుంటూ బిల్లులు విడుదల చేయలేదని సమాచారం. దీంతో విసుగు చెందిన సదరు కాంట్రాక్టరు చివరకు భోజనాల సరఫరాను నిలిపివేశారు. తానింకా జేబులో నుంచి డబ్బులు పెట్టుకోలేనని, ఇప్పటికే అప్పుల పాలు అయ్యాయని.. సరుకులు కొనడానికి, పనివాళ్లు, వంట వాళ్లకు వేతనాలు చెల్లించుకోవాలి కదా? అంటూ ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది. తనకు ఇంకా ఓపిక లేదని చెబుతూ భోజనాల సరఫరా బంద్‌చేసినట్టు తెలిసింది. సీఎం, సీఎస్, సీఎంవో అధికారులు ఉండే ఆరో అంతస్తు పరిస్థితే ఇలాఉంటే మిగిలిన కార్యాలయాల్లో ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయో అని సచివాలయ ఉద్యోగులు కారిడార్‌లో గుసగుసలు పెట్టుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి బిల్లుల కోసం వచ్చే వారికి అదే పరిస్థితి సచివాలయంలో కూడా ఉందని తెలియాలి కదా? అంటూ ఎద్దేవా చేస్తున్నట్టు తెలిసింది.

# వర్షాలతో చిగురించిన ఆశలు..!

**కాటారం,ఫ్లాష్ ఇండియా :** ఇటీవల కురిసిన వర్షాలు రైతుల్లో కొత్త ఆశలు చిగురింపజేశాయి. కొన్నేళ్లుగా వర్షాభావం, పంటల నష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ఈసారి ప్రకృతి అనుకూలించడంతో కోటి ఆశలతో దుక్కులు ప్రారంభించారు. ఖరీఫ్ సాగుకు అనుకూల వాతావరణం నెలకొనడంతో కాటారం మండల వ్యాప్తంగా రైతులు పొలాల్లో వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. ఎక్కడ చూసినా ట్రాక్టర్లతో దుక్కులు దున్నుతూ, విత్తనాలు, ఎరువుల సేకరణ, సాగు ఏర్పాట్లలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ నెలలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు, వాగులు కొంత మేర నీటితో నిండాయి. దీంతో భూగర్భ జల మట్టం కూడా మెరుగు పడుతుండటంతో రైతులు ధైర్యంగా వ్యవసాయ సాగు పనులు ప్రారంభించారు. పొలాలను దున్నడం, విత్తనాల ఎంపిక, ఎరువుల కొనుగోలు, నాట్ల ఏర్పాట్లు వంటి పనులు వేగంగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు కూడా వ్యవసాయ పనుల్లో పాల్గొంటూ రైతులకు అండగా నిలుస్తున్నారు. మండల కేంద్రంలో విత్తన, ఎరువుల కొనుగోలు,ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాల రాకపోకలతో సందడి వాతావరణం నెలకొంది. ఈ ఏడాది తాము విత్తిన విత్తనాలు సమృద్ధిగా మొలకెత్తి పచ్చని పైరులతో పొలాలు కళకళలాడాలని రైతులు ఆశిస్తున్నారు. ఈసారి వర్షాలు అనుకూలంగా కొనసాగితే ఖరీఫ్ పంటలు మంచి దిగుబడులు ఇస్తాయని వారు ఆశిస్తున్నారు. ప్రకృతి కరుణిస్తే ఈ ఏడాది వ్యవసాయం లాభదాయకంగా మారుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


**గత పంట పెట్టుబడులు తిరిగి రాక అప్పుల భారం**

రెండు సంవత్సరాలుగా పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లభించక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట సాగుకు చేసిన పెట్టుబడులు తిరిగి రాక అప్పుల భారం పెరిగింది. ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉండటంతో పాటు ప్రభుత్వం కనీస మద్దతు ధరలను సమర్థవంతంగా అమలు చేసి, మార్కెట్లో పంటలకు గిట్టుబాటు ధరలు లభించాలని రైతులు కోరుతున్నారు. దిగుబడులు బాగా వచ్చినా ధరలు లేకపోతే రైతులకు ప్రయోజనం ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఈ ఖరీఫ్ సీజన్లో పంటలు బాగా పండితే..**

ఈ ఖరీఫ్ సీజన్లో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండితే గత నష్టాల నుంచి బయటపడగలమనే నమ్మకం రైతుల్లో కనిపిస్తోంది. కాటారం వ్యవసాయ అధికారిని పూర్ణిమ కూడా రైతులకు అవసరమైన సూచనలు అందిస్తూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వినియోగించాలని సూచిస్తున్నారు. సరైన సమయంలో వర్షాలు కురిస్తే వరి, పత్తి, మిర్చి, తదితర పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశ ముందని రైతులు భావిస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న వ్యవసాయ కదలికలు రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ప్రకృతి సహకరించి, ప్రభుత్వం కూడా రైతులకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తే ఈ ఖరీఫ్ సీజన్ రైతులకు మంచి ఫలితాలను అందిస్తుందని రైతులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

# ఐటీ శాఖ డిక్లరేషన్‌లో వెల్లడి



**కొచ్చి :** దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, మళయాల సూపర్ స్టార్ మోహన్‌లాల్ ను కొన్నేళ్లుగా వెంటాడుతున్న ఏనుగు దంతాల నిల్వ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆదాయపు పన్ను శాఖకు మోహన్‌లాల్ గతంలో సమర్పించిన వాలంటరీ డిస్క్లోజర్ స్కీమ్ నివేదిక ప్రకారం.. ఆయన వద్ద మొత్తం 10 ఏనుగు దంతాలు , 13 దంతపు విగ్రహాలు ఉన్నట్లు అధికారికంగా డిక్లేర్ చేసిన పత్రాలు ఇప్పుడు కేరళ హైకోర్టు ముందుకొచ్చాయి.

**పదేళ్లుగా నడుస్తున్న వివాదం..**

2011 జూన్ నెలలో మోహన్‌లాల్ ఇళ్లు, కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కొచ్చిలోని ఆయన నివాసంలో 4 ఏనుగు దంతాలు లభ్యమయ్యాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం అనుమతి లేకుండా ఏనుగు దంతాలను కలిగి ఉండటం నేరం కావడంతో కేరళ అటవీ శాఖ ఆయనపై కేసు నమోదు చేసింది. అయితే, ఈ కేసుకు సంబంధించి కోర్టులో సుదీర్ఘంగా వాదనలు జరుగుతున్నాయి. తాజాగా, కేసులో భాగంగా మోహన్‌లాల్ తరపున సమర్పించిన నివేదికల ప్రకారం.. తాను అటవీ చట్టాలను ఉల్లంఘించలేదని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అమ్నెస్టీ పథకం కింద ఆస్తులను ముందే డిక్లేర్ చేశానని మోహన్‌లాల్ కోర్టుకు వివరించారు. కానీ, మోహన్‌లాల్ తన వద్ద ఉన్న దంతాల వివరాలను ఐటీ శాఖకు వెల్లడించినప్పటికీ, అటవీ శాఖ నుంచి వీటికి సంబంధించిన లీగల్ ఓనర్‌షిప్ సర్టిఫికేట్ సరైన సమయంలో పొందారా లేదా అనే అంశంపైనే ప్రస్తుతం హైకోర్టులో విచారణ ఉత్కంఠగా కొనసాగుతోంది.



## నేలమట్టమైన శతాబ్ది కాలం నాటి ఆలయం..

**భద్రాచలం,ఫ్లాష్ ఇండియా :** శతాబ్ది కాలంనాటి చరిత్ర నేలమట్టం అయ్యింది. రామాలయం అభివృద్ధిలో భాగంగా, అనుబంధ ఆలయం అయిన శ్రీ కుసుమ హరనాధ్ బాబా ఆలయాన్ని కూల్చివేశారు. 19 వ శతాబ్దం చివరలో ఈ ఆలయాన్ని అత్యంత ఆధ్యాత్మిక ప్రాముఖ్యతతో నిర్మించారు. ఈ ఆలయ ప్రాంగణం, మండపాలను రామాలయ మాడవీధుల విస్తరణ అవసరాలకోసం కూల్చివేసి, శివాలయం కు వెళ్లే దారిలో బాలాలయం నిర్మించి కుసుమ, హరల విగ్రహాలను బాలాలయంకు తరలించారు. అయితే రాతి కట్టడంతో, ఎత్తయిన ప్రదేశంలో ఎంతో సుందరంగా కనిపించే ఈ ఆలయం అభివృద్ధి మాటున నేలకొరగటం భక్తులను కలచివేసింది.

## చరిత్ర సృష్టించిన మధ్యప్రదేశ్ సర్కార్..

**మధ్యప్రదేశ్ :** మధ్యప్రదేశ్ ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డును పునర్వ్యవస్థీకరిస్తూ, అందులో తొలిసారిగా ముస్లిమేతర.. అంటే హిందువులకు సభ్యులకు స్థానం కల్పించింది. సాధారణంగా ముస్లిం వర్గానికి చెందిన ప్రతినిధులు మాత్రమే ఉండే ఈ బోర్డులోకి న్యాయ నిపుణులు, ప్రభుత్వ అధికారుల కోటా కింద హిందూ సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. వక్ఫ్ బోర్డు నిర్వహణ, ఆస్తుల పరిశీలన, చట్టపరమైన ప్రక్రియలను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా సీఎం మోహన్ యాదవ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం చెబుతోంది.

**హిందూ సభ్యుల నియామకం..**

వక్ఫ్ బోర్డులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ప్రతినిధులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, న్యాయ నిపుణుల విభాగంలో సజీవ్ శ్రీవాస్తవ అనే సబ్-రిజిస్ట్రార్ స్థాయి అధికారితో పాటు మరికొందరు ముస్లిమేతర సభ్యులను బోర్డులో చేర్చారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వక్ఫ్ చట్టంలో సవరణలు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో మధ్యప్రదేశ్ సర్కార్ తీసుకున్న నిర్ణయం ఇండియన్ పొలిటికల్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# భర్త నరాల్లోకి 'హార్పిక్'

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** పర పురుషుడి వ్యామోహంలో పడి, వివాహేతర సంబంధాలకు అలవాటు పడిన భార్యలు, అమాయకులైన భర్తల ప్రాణాలను గాలిలో కలిపేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో దారుణం వెలుగుచూసింది. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ భార్య కట్టుకున్న భర్తను అత్యంత కిరాతకంగా అంతమొందించింది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ పట్టణ శివారు ప్రాంతంలో నివసిస్తున్న ప్రశాంత్, సంధ్య దంపతులు నివాసం ఉంటున్నారు. అయితే, గత కొంతకాలంగా ఇద్దరిమధ్య గొడవలు జరుగుతున్నాయి. సంధ్యకు మరో వ్యక్తితో ఉన్న వివాహేతర సంబంధమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ క్రమంలో భర్తను ఎలాగైనా శాశ్వతంగా వదిలించుకోవాలని సంధ్య పక్కా స్కెచ్ వేసింది. పథకం ప్రకారం భర్త ప్రశాంత్‌కు అతిగా మద్యం తాగించింది. అతడు పూర్తిగా మత్తులోకి జారుకున్నాక ప్రియుడిని ఇంటికి పలిపించి ఇద్దరూ తీవ్రంగా దాడి చేసి భవనం మీద నుంచి మొదట కిందకు తోసేశారు. ఈ ప్రమాదంలో ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి, కానీ ప్రాణాలు మాత్రం పోలేదు.

**నరాల్లోకి టాయిలెట్ క్లీనర్ ఇంజెక్ట్..**

అయితే, దాడి చేసిన భవనం పైనుంచి తోసేసినా.. ప్రశాంత్ ఇంకా బతికే ఉన్నాడని, శ్వాస తీసుకుంటున్నాడని సంధ్య గమనించింది. ఎలాగైనా అతడని అంతమొందించాలనే కసితో ఇంట్లో బాత్-రూమ్‌లో ఉన్న టాయిలెట్ క్లీనర్ హార్పిక్ లిక్విడ్‌ను ఓ సిరంజిలోకి తీసుకుని ప్రశాంత్ నరాల్లోకి నేరుగా ఎక్కించింది. శరీరంలోకి విషపూరితమైన క్లీనర్ చేరడంతో ప్రశాంత్ కొద్దిసేపటికే అత్యంత దారుణమైన స్థితిలో ప్రాణాలు విడిచాడు. అయితే, భార్య సంధ్యపై అనుమానం వచ్చిన ప్రశాంత్ కుటుంబ సభ్యులు పోలీసులు సమాచారం అందజేయగా.. వారు స్పాటు చేరుకుని భార్య సంధ్య, ప్రియుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే, వివాహేతర బంధం కోసం అగ్ని సాక్షిగా తాళి కట్టిన భర్తనే దారుణంగా హతమార్చిన విషయం విని జిల్లా ప్రజలు.. ఇదేం పని అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

క్షేత్ర స్థాయి లో విచారణ త్వరగా చేయాలి
గ్రీవెన్స్ వినతులు పెండింగ్ లో ఉండొద్దు
జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి తమ సమస్య ల పైన వినతులను సమర్పించే ప్రజలకు నమ్మకం కలిగేల.... వారి సమస్యలను త్వరితగతిన పరిష్కారించేందుకు జిల్లా అధికారులు కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన "ప్రజావాణి" కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజల నుంచి కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులను తీసుకుని..వారి సమస్యలను అడిగి తెలుసుకుని... సమస్య పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ప్రజల వినతులను పెండింగ్‌లో లేకుండా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, పారదర్శకంగా ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం అని స్పష్టం చేశారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా.. వారి అర్జీలను త్వరగా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు సూచించారు. ఈనాటి గ్రీవెన్స్ కి 396 వినతులు రాగ... అందులో కొన్నింటి వివరాలు జనగాం మండలం వెంకీర్యాల గ్రామానికి చెందిన రామగుండం పద్మ అనే మహిళ ఇందిరమ్మ ఇళ్ళు కోసం దరఖాస్తు సమర్పించిందిదేవరోప్పుల మండలం నిర్మల గ్రామానికి చెందిన అంగల మనోహర్ రెడ్డి అనే వ్యక్తి తనకు చెందిన భూమి... పూర్తిగా పాస్ బుక్ లో నమోదు కాలేదని...సర్వే ప్రక్రియ పూర్తి అయిన భూమికి సంబందించిన వివరాలను పాస్ బుక్ లో నమోదు చేయాలనీ కోరారు జనగాం మండలం ఇప్పగూడెం కి చెందిన శ్రీకాంత్.. తను పేదవాడిని అలాగే అందుడని పేర్కొంటూ... అంత్యోదయ కార్డు కావాలని కోరారు బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన లక్ష్మయ్య తనకు చెందిన భూమి ని వారసత్వ పట్టా ప్రకారం తన పేరు మీదకు మార్చాలని వినతి సమర్పించాడుఈ ప్రజావాణిలో డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలకు రుచికరమైన భోజనం అందుతున్నదా..?

**సత్తుపల్లి,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సోమవారం సత్తుపల్లి పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆమె విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారి పేర్లు, చదువు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందాయా, పాఠశాలలో రుచికరమైన భోజనం అందుతున్నదా అని అడిగి తెలుసుకున్నారు. చిన్నప్పటి నుంచే ధైర్యంగా మాట్లాడే అలవాటు పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకే అప్పగించారు. తర్వాత సత్తుపల్లి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డుకు ఇరువైపులా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, ఆసుపత్రి వైద్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ దయానంద్ విజయ్ కుమార్, ఎంఈఓ నక్క రాజేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె. నరసింహ, ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెహనా బేగం, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, వార్డు కౌన్సిలర్లు, దూదిపాల రాంబాబు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, జగన్నాథం శీను, మండల అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి ముప్పు

## ఫిర్యాదులపై మెరుపు దాడులు

- అక్రమ వధశాలపై దాడి చేసి మాంసం స్వాధీనం
- 120 కిలోల నాసిరకం మాంసం సీజ్ చేసిన అధికారులు
- రూ.లక్ష విలువైన మాంసం శాస్త్రీయంగా పూడ్చివేత
- అక్రమ మాంస విక్రయాలపై మున్సిపాలిటీ ఉక్కుపాదం
- వ్యాపారులకు రూ.30 వేల జరిమానా విధించిన అధికారులు
- ప్రజారోగ్యానికి ముప్పుగా అక్రమ వధశాలలు గుర్తింపు








**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జనగామ పట్టణ ప్రజల నుండి మాంసం విక్రయాల నాణ్యతపై, అలాగే చనిపోయిన లేదా వ్యాధిగ్రస్తమైన గొర్రెలు, మేకలను అక్రమంగా వధ చేసి విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు తరచుగా అందుతున్న నేపథ్యంలో, ఈరోజు జనగామ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడినవి. తనిఖీల సందర్భంగా పట్టణంలోని ఒక అక్రమ మాంస వధశాలపై దాడి చేసి, సుమారు 120 కిలోల మాంసం (సుమారు రూ. 1,00,000/- విలువ) స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగింది. ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా స్వాధీనం చేసుకున్న మాంసాన్ని జనగామ పట్టణ జంతువుల వధశాల (స్లాటర్ హౌస్) ప్రాంగణంలో జేసీబీ సహాయంతో శాస్త్రీయ పద్ధతిలో పూడ్చివేయడం జరిగింది. విచారణలో కొంతమంది వ్యాపారులు ప్రభుత్వ అనుమతితో నిర్వహిస్తున్న స్లాటర్ హౌస్‌కు జంతువులను తీసుకురాకుండా, తమ సొంత ప్రాంగణాల్లో అక్రమంగా జంతువులను వధ చేసి మాంసాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించబడింది. ఇటువంటి చర్యలు ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా మారే అవకాశం ఉన్నందున సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించడంతో పాటు రూ. 30,000/- జరిమానా కూడా విధించడం జరిగింది. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన మాంసం అందించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని, ఇకపై కూడా అక్రమ మాంస వధశాలలు, నాణ్యతలేని మాంసం విక్రయాలపై నిరంతర తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ప్రజలు కూడా అనుమానాస్పద మాంసం విక్రయాలు లేదా అక్రమ వధశాలల గురించి సమాచారం ఉంటే వెంటనే జనగామ మున్సిపాలిటీకి తెలియజేసి సహకరించాలని కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ గోపయ్య, వార్డు అధికారులు కుమార్, నిఖిల్, శేఖర్, జవాన్లు తిరుమల రాజు, కృష్ణ, లక్ష్మణ్ మరియు మున్సిపాలిటీ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు ఫీజులలో రాయితీ కల్పించాలి




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** టీయూడబ్ల్యూజే (ఐజేయు) నల్లగొండ జిల్లా కమిటీ పిలుపుమేరకు సోమవారం జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలిమెల నాగయ్య, టియుడబ్ల్యూజే-ఐజేయు జిల్లా ప్రచార కార్యదర్శి ఎండి అస్లంల ఆధ్వర్యంలో మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ డీఏఓ శ్రీనివాస శర్మ,మండల విద్యాధికారి ధర్మానాయక్ లకు వినతి పత్రాలు సమర్పించారు. జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు పాఠశాలలలో ఫీజు రాయితీ కల్పించాలని కోరారు. ఫీజు రాయితీ సర్క్యులర్ జారీ చేసేంతవరకు ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజన్ టీయూడబ్ల్యూజే (ఐజేయు) అధ్యక్షులు బాలాజీ రావు,ప్రధాన కార్యదర్శి రమేష్ సీనియర్ జర్నలిస్టులు నామిరెడ్డి నరేందర్ రెడ్డి,ఖాజా నాజీముద్దిన్,సుమన్,కిషోర్ డివిజన్ ప్రచార కార్యదర్శి కాతోజు నాగ చారి,అస్లం,బండ వేణుగోపాల్ రెడ్డి,అశోక్,రాచకొండ రమేష్,సునీల్ చౌదరి,కిషోర్,శీను,కాట్రాజ్ అశోక్,నక్క శ్రీను,వెంకన్న,హరీష్ బాబు,తోఫిక్,కట్ట బాబు,వసీం,నగేష్ తోపాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



# పార్కు స్థలం కబ్జాపై ఫిర్యాదు

**దుండిగల్,ఫ్లాష్ ఇండియా :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి సర్కిల్ లోని జయభేరి పార్క్ స్థలం కబ్జాకు గురైంది. ఈ తరుణంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజనకు కొంపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జెమ్మి దేవేందర్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి అడ్డదారిలో అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. స్టేటస్ కో ఉన్నా అక్రమ అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టపడడంలేదన్నారు,చర్యలు తీసుకోవాలంటూ సీఎంసి కమిషనర్ శ్రీజనకు ఫిర్యాదు చేసునట్లు తెలిపాడు.



# ఎస్ఐఆర్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు

**మొయినాబాద్,ఫ్లాష్ ఇండియా :** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సోమవారం చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్ మండలంలో పర్యటించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను పొరపాట్లకు తావివ్వకుండా సమర్థవంతంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎంకేపల్లి వార్డు బీఎల్వోలను ఎస్ఐఆర్ ఫారం పంపిణీ, నింపడం, డిజిటలైజ్ ప్రక్రియపై ఆరా తీసి, ఫీల్డ్ అధికారులు, బీఎల్వోలు, ఓటర్లకు ఎదురయ్యే సమస్యలపై సందేహాలు నివృత్తి చేశారు. మండలంలో తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో 11వ వార్డు కౌన్సిలర్ మహేష్ విజ్ఞప్తి మేరకు ఎంకేపల్లిలోని హైస్కూల్‌లో కొత్తగా చేపట్టిన టాయిలెట్ల నిర్మాణం పరిశీలించారు. అలాగే ప్రైమరీ స్కూల్‌లో శిథిలావస్థకు చేరిన గదిని కూల్చివేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

# ప్రజావాణితో సత్వర సమస్యల పరిష్కారం




**కార్వాన్,ఫ్లాష్ ఇండియా :** జీహెచ్ఎంసీ గోల్కొండ జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. గోల్కొండ జోన్ జోనల్ కమిషనర్ పి. ఉదయ్ కుమార్, అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సమీక్షించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ.. ప్రజావాణికి వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను సత్వరంగా, సమర్థవంతంగా పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ ప్రజావాణి ద్వారా నిరంతరం కట్టుబడి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జోన్ జాయింట్ కమిషనర్ శ్రీహరి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్, జీహెచ్ఎంసీకి చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఆకతాయిల ఆగడాలు..

**పెద్ద అడిశర్లపల్లి,ఫ్లాష్ ఇండియా :** పీఏపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని ఆకతాయిలు విధ్వంసానికి పాల్పడ్డారు. ఏడో తరగతి గది కిటికీలను పగులగొట్టి తరగతి గదిలోకి ప్రవేశించిన వారు విద్యుత్ ఎలక్ట్రికల్ బోర్డులను ధ్వంసం చేసి, విద్యార్థుల పాఠ్యపుస్తకాలను ఎత్తుకెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. అంతేకాకుండా, తరగతి గదులు, పాఠశాల వరండాలో మూత్ర విసర్జన చేసి అసహ్యకర పరిస్థితులు సృష్టించారు. ప్రధానోపాధ్యాయుల గది తాళాన్ని పగులగొట్టేందుకు ప్రయత్నించినప్పటికీ అది సాధ్యంకాకపోవడంతో గదిలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేసేందుకు యత్నించినట్లు తెలిపారు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ ఘటనను చూసి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పాఠశాల ఆవరణ, వరండా అంతా మూత్ర విసర్జనతో దుర్వాసన వెదజల్లుతుండటంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ ఘటన పై ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ గుడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో విధ్వంసానికి పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టి ప్రభుత్వ పాఠశాలలకు భద్రత కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# ఇదే నా చివరి వరల్డ్ కప్

ఫుట్‌బాల్ ప్రపంచ దిగ్గజ ఆటగాళ్లలో ఒకరైన క్రిస్టియానో రొనాల్డో తన కెరీర్‌కు సంబంధించి అధికారిక ప్రకటన చేశాడు. 2026 ఫిఫా వరల్డ్‌కప్ తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్ అని స్పష్టం చేసిన ఆయన, ఈ టోర్నీలోని ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలనుకుంటున్నట్లు అన్నారు. స్పెయిన్‌తో జరగనున్న రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన ఈ పోర్చుగల్ కెప్టెన్.. తన వరల్డ్‌కప్ భవిష్యత్తుపై నెలకొన్న ఊహాగానాలకు తెరదించాడు. ఈ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. "ఇదే నా చివరి వరల్డ్‌కప్. అయితే రేపటి మ్యాచ్ నా చివరి మ్యాచ్ కాకూడదని ఆశిస్తున్నాను" అని రొనాల్డో వ్యాఖ్యానించాడు. పోర్చుగల్ జట్టు టోర్నీలో మరింత ముందుకు సాగాలని కోరుకుంటున్నానని, ప్రస్తుతం తన దృష్టి మొత్తం జట్టు విజయంపైనే ఉందని చెప్పుకొచ్చాడు. అలాగే మీడియా, విమర్శకుల నుంచి వస్తున్న వ్యాఖ్యలపై కూడా రొనాల్డో స్పందించాడు. పోర్చుగల్ తదుపరి దశకు చేరితే తనపై విమర్శలు కొనసాగించడానికి మరో అవకాశం లభిస్తుందని సరదాగా వ్యాఖ్యానించాడు."అలా అయితే మీరు నన్ను ఇంకొంచెం విమర్శించవచ్చు. నన్ను ఎప్పుడూ విమర్శించాలనే ప్రయత్నం చేస్తుంటారు" అని చిరునవ్వుతో అన్నాడు. మరో సందర్భంలో విలేకరులు తన చివరి వరల్డ్‌కప్ మ్యాచ్ కావొచ్చని ప్రశ్నించగా.. "మీరు నన్ను ఇక చూడకూడదనుకుంటున్నారా?" అంటూ చమత్కరించాడు. అయితే తన కెరీర్‌పై ఎలాంటి పశ్చాత్తాపం లేదని స్పష్టం చేశాడు. "రేపు ఏం జరిగినా నేను పూర్తి సంతృప్తితో వెళ్తాను. 100% కాదు.. 1000%.. ఫుట్‌బాల్‌కు నేను ఇవ్వగలిగినదంతా ఇచ్చాను" అని రొనాల్డో అన్నారు.

**డబ్బు కోసం కాదు.. ఫుట్‌బాల్‌పై ప్రేమతోనే:**

తాను ఎప్పుడూ డబ్బు కోసం ఫుట్‌బాల్ ఆడలేదని రొనాల్డో పేర్కొన్నాడు. దేవుడి దయతో నా జీవితం చాలా బాగుంది. నేను ఫుట్‌బాల్ ఆడటానికి కారణం డబ్బు కాదు. ఈ ఆటపై ఉన్న ప్రేమే.. నన్ను ఇన్ని సంవత్సరాలు ముందుకు నడిపించింది అని చెప్పుకొచ్చారు. ఈ టోర్నీలో తన ప్రదర్శనపై వస్తున్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టాడు. ఇప్పటివరకు మూడు గోల్స్ సాధించానని, కొందరు మరింత బాగా ఆడుతున్నప్పటికీ తాను చెడు ప్రదర్శన చేయలేదని స్పష్టం చేశాడు.

**స్పెయిన్‌తో కీలక పోరు:**

ఇక రౌండ్ ఆఫ్ 16లో పోర్చుగల్‌కు స్పెయిన్ రూపంలో గట్టి సవాల్ ఎదురుకానుంది. ఈ మ్యాచ్ విజేత క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోనుంది. స్పెయిన్ బలమైన జట్టేనని అంగీకరించిన రొనాల్డో.. నాకౌట్ మ్యాచ్‌లలో చిన్న చిన్న అంశాలే ఫలితాన్ని నిర్ణయిస్తాయని అభిప్రాయపడ్డాడు. స్పెయిన్ ఎప్పుడూ టైటిల్ ఫేవరెట్ జట్టే. వారికి మాకంటే ఎక్కువ విజయాలు ఉన్నాయి. కానీ ఇది వేరే టోర్నీ, వేరే ఆటగాళ్లు. గెలుపు చిన్న చిన్న విషయాలపైనే ఆధారపడి ఉంటుంది అని రోనాల్డో అన్నాడు. స్పెయిన్‌పై తన రికార్డు కూడా బాగానే ఉందని.. ఈ మ్యాచ్‌లో మేమే గెలుస్తామనే భావన ఉన్నదని ధీమా వ్యక్తం చేశాడు. స్పెయిన్‌పై పోర్చుగల్ విజయం సాధిస్తే రొనాల్డో చివరి వరల్డ్‌కప్ ప్రయాణం మరికొంత కాలం కొనసాగుతుంది. ఒకవేళ ఓడిపోతే మాత్రం ఫుట్‌బాల్ చరిత్రలో అత్యంత గొప్ప కెరీర్‌లలో ఒకటైన రొనాల్డో అధ్యాయం ముగియనుంది.

# ఏడోసారి పొట్టి కప్పు సొంతం



మహిళల టీ20 వరల్డ్ కప్-2026 విజేతగా ఆస్ట్రేలియా జట్టు నిలిచింది. లండన్‌లోని ప్రతిష్టాత్మకమైన లార్డ్స్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో ఆసిస్ 7 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించింది. దీంతో ఆస్ట్రేలియా 7వ సారి టీ20 వరల్డ్ కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఇప్పటికే రికార్డు స్థాయిలో టీ20 ప్రపంచకప్ గెలిచిన ఘనత ఆ జట్టు సొంతం. ఇప్పుడు ఆ రికార్డును మరింత పదిలం చేసుకుంది. ఫైనల్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. ఆ జట్టును కెప్టెన్ నాట్ స్కివర్ బ్రంట్, ఫ్రెయా కెంప్ కీలక ఇన్నింగ్స్ ఆడి ఆదుకున్నారు. బ్రంట్ 53 బంతుల్లో 58 పరుగులు చేయగా.. కెంప్ 28 బంతుల్లో 44 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. అయితే, పోరాడే లక్ష్యాన్ని ఇంగ్లాండ్ కాపాడుకోలేకపోయింది. 151 పరుగుల టార్గెట్‌ను ఆస్ట్రేలియా అలవోకగా ఛేదించింది. బెత్ మూనీ 49 బంతుల్లో 64 పరుగులతో రాణించింది. లిచ్‌ఫీల్డ్ కూడా 35 బంతుల్లో 48 రన్స్ చేసి సత్తాచాటింది. వీరిద్దరూ రాణించడంతో ఆస్ట్రేలియా 17.1 ఓవర్లలోనే విజయం సాధించి టైటిల్ ఎగరేసుకుపోయింది.





# వైభవ్ అరంగేట్రంపై మండిపడ్డ మాజీ క్రికెటర్!

భారత్, ఇంగ్లండ్ మధ్య మాంచెస్టర్ వేదికగా జరిగిన రెండో టీ20లో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రం చేసిన విషయం తెలిసిందే. అయితే టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్ నుంచి సంజు శాంసన్‌ను తప్పించడం మాజీ క్రికెటర్లు, అభిమానుల మధ్య తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా మాజీ భారత బ్యాటర్ సంజయ్ మంజ్రేకర్.. టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో ఘాటుగా స్పందించాడు. మూడు మ్యాచ్‌లలో విఫలమైతే ప్రపంచకప్ హీరోను పక్కనపెడుతారా?.. ఏమైనా జోక్ చేస్తున్నారా? అంటూ ఫైర్ అయ్యాడు.వైభవ్‌కు అవకాశం ఇవ్వడాన్ని స్వాగతించిన సంజయ్ మంజ్రేకర్.. సంజును జట్టు నుంచి తప్పించడం మాత్రం సరికాదన్నాడు. తన 'ఎక్స్' ఖాతాలో స్పందిస్తూ.. 'భారత్ జెర్సీలో వైభవ్‌ను చూడటం చాలా ఆనందంగా ఉంది. కానీ సంజు శాంసన్ సంగతేంటి?. అతడిని జట్టు నుంచి తప్పించారా?, ఇది నిజమేనా?. గాయపడినందుకే తప్పించి ఉంటారని నేను ఆశిస్తున్నా. లేకపోతే ఇది అత్యంత విచిత్రమైన సెలెక్షన్ నిర్ణయాల్లో ఒకటిగా మిగిలిపోతుంది. సెలక్టర్లు జోక్ చేస్తున్నారా?. వైభవ్‌కు అవకాశం ఇవ్వాలనుకుంటే సంజును మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపించొచ్చు కదా' అని రాసుకొచ్చాడు.టీ20 ప్రపంచకప్ 2026లో సంజు శాంసన్ అద్భుత ప్రదర్శన కనబరిచి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత మూడు టీ20 ఇన్నింగ్స్‌ల్లో 5, 0, 1 పరుగులు మాత్రమే చేయడంతో అతడిని జట్టు నుంచి తప్పించడం అభిమానుల్లోనూ అసంతృప్తికి కారణమైంది. మూడు మ్యాచ్‌లలో విఫలమైనందుకు పెద్ద ఆటగాడిని పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మాజీ భారత బ్యాటర్ అంబటి రాయుడు కూడా శాంసన్‌కు మద్దతుగా నిలిచాడు. వైభవ్ అరంగేట్రం ఆనందించాల్సిన విషయమే అయినప్పటికీ.. సంజు ఇటీవల చేసిన సేవలను మరచిపోవద్దని సూచించాడు. 'వైభవ్‌కు అభినందనలు. అతడి అరంగేట్రం వేడుక చేసుకోవాల్సిందే. కానీ కేవలం మూడు టీ20 మ్యాచ్‌ల క్రితమే సంజు ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడనే విషయాన్ని మర్చిపోవద్దు' అని రాయుడు పేర్కొన్నాడు. ఈ ఎదురుదెబ్బను సంజు సానుకూలంగా తీసుకుని మరింత బలంగా తిరిగి వస్తాడని తాను విశ్వసిస్తున్నట్లు అంబటి రాయుడు తెలిపాడు. అదే సమయంలో వైభవ్ సూర్యవంశీకి కూడా శుభాకాంక్షలు తెలుపుతూ.. అతడు భారత క్రికెట్‌లో సుదీర్ఘ కెరీర్ కొనసాగించి ఎన్నో రికార్డులు బద్దలు కొట్టాలని ఆకాంక్షించాడు. రెండో టీ20లో వైభవ్ 10 బంతుల్లో 14 పరుగులు చేశాడు. ఎప్పటిలానే రెండు భారీ సిక్సర్లు బాది తన దూకుడును చూపించాడు. అయితే విల్ జాక్స్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యి ఇన్నింగ్స్‌ను ముగించాడు. మ్యాచ్‌లో భారత్ నిర్దేశించిన 191 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 19 ఓవర్లలోనే ఛేదించి నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ ప్రస్తుతం 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఇప్పుడు సిరీస్‌ను కైవసం చేసుకోవాలనుకుంటే భారత్ మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో తప్పక విజయం సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# బిజినెస్

## మళ్లీ నోకియా ఫోన్లు వస్తున్నాయ్..





ప్రముఖ నోకియా బ్రాండ్‌పై మొబైళ్లను తయారుచేసే ఫిన్లాండ్‌కు చెందిన హెచ్ఎండీ గ్లోబల్ సంస్థ సరికొత్తగా నాలుగు నోకియా ఫీచర్ ఫోన్‌లను ఒకేసారి భారత మార్కెట్‌లోకి విడుదల చేస్తోంది. నోకియా 200 4G, నోకియా 210 4G మోడళ్లతో పాటు గతంలో సూపర్ హిట్ అయిన నోకియా 215 4G, నోకియా 235 4G ఫోన్ల రెండో ఎడిషన్ వెర్షన్లను కూడా ఈ జాబితాలో చేర్చింది. సాధారణ ఫీచర్ ఫోన్లకు భిన్నంగా ఈ సరికొత్త సిరీస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫీచర్లను జోడించడం విశేషం. హెచ్ఎండీ తీసుకొచ్చిన ఈ సరికొత్త నోకియా 4G ఫీచర్ ఫోన్లలో ఎన్నో అధునాతన ఆప్షన్లను యూజర్ల కోసం అందుబాటులోకి తెచ్చారు. ఈ ఫోన్లలో ప్రత్యేకంగా ఒక 'ఏఐ బటన్' ఆప్షన్‌ను అందించారు. దీనితో పాటు ఇందులో 'ఎక్స్‌ప్రెస్ చాట్' యాప్‌ను ప్రీ-ఇన్‌స్టాల్‌గా ఇచ్చారు. దీని ద్వారా వినియోగదారులు చాలా సులువుగా వీడియో కాల్స్ మాట్లాడుకునే వీలుంటుంది. ఈ ఫోన్‌లలో అన్నింటికంటే ముఖ్యంగా చెప్పుకోవాల్సింది 'Sikey AI' అసిస్టెంట్ ఫీచర్. ఈ సరికొత్త ఏఐ అసిస్టెంట్ సాయంతో కేవలం మన వాయిస్ కమాండ్స్‌తోనే మొబైల్ ఫ్లాష్‌లైట్ ఆన్ చేయడం, కెమెరా ఓపెన్ చేయడం, రిమైండర్‌లు సెట్ చేసుకోవడం, అలాగే నేరుగా ఫోన్ కాల్స్ చేయడం వంటి పనులను క్షణాల్లో పూర్తి చేయవచ్చు. అంతేకాకుండా, ఈ మొబైళ్లలో ఇంటర్నల్ స్టోరేజీతో సంబంధం లేకుండా నేరుగా క్లౌడ్ ద్వారా ఫీచర్లను ఉపయోగించుకునే 'క్లౌడ్ ఫోన్ సర్వీస్' ఆప్షన్‌ను కూడా జోడించారు.ఈ నాలుగు ఫీచర్ ఫోన్లలో లాంగ్ లాస్టింగ్ బ్యాటరీ లైఫ్ కోసం 1450mAh సామర్థ్యం గల శక్తివంతమైన బ్యాటరీని అమర్చారు. ఆధునిక కాలానికి అనుగుణంగా ఈ ఫోన్లన్నింటికీ యూఎస్‌బీ టైప్-సి ఛార్జింగ్ పోర్ట్ సదుపాయాన్ని కల్పించారు. మార్కెట్లోకి స్ట్రెయిట్ ఎంట్రీ ఇచ్చిన ఈ నోకియా 4G ఫోన్‌ల ధరలను కానీ, ఇవి ఎప్పటి నుంచి మార్కెట్లో విక్రయానికి అందుబాటులోకి వస్తాయనే వివరాలను కానీ హెచ్ఎండీ సంస్థ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. త్వరలోనే ఈ ధరల వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.




# విడత ఉద్యోగాల కోత

గ్లోబల్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల కోతలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కంపెనీ తన మొత్తం ఉద్యోగుల్లో 2.5 శాతం వరకు తొలగించే ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ నిర్ణయాన్ని వచ్చే వారం ప్రారంభంలో ప్రకటించే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఈ కోతలు ప్రధానంగా సేల్స్, కన్సల్టింగ్, అలాగే ఎక్స్‌బాక్స్ గేమింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే ఈ వార్తలపై మైక్రోసాఫ్ట్ అధికారికంగా స్పందించలేదు. ఏఐ మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు పెడుతూనే, నిర్వహణ ఖర్చులను తగ్గించే వ్యూహంలో భాగంగానే ఈ పునర్వ్యవస్థీకరణ జరుగుతున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల ఎక్స్‌బాక్స్ గేమింగ్ విభాగంలో కూడా ఉద్యోగాల కోతలు, మార్కెటింగ్ బడ్జెట్ తగ్గింపు, వ్యాపార పునర్వ్యవస్థీకరణపై చర్చలు జరుగుతున్నట్లు పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. గత ఏడాది కూడా మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగుల్లో సుమారు 4 శాతం మందిని తొలగించింది. మరోవైపు, ఏఐపై దృష్టి పెంచుతున్న టెక్నాలజీ రంగంలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మెటా ఈ ఏడాది తన ఉద్యోగుల్లో 10 శాతం మందిని తగ్గించే ప్రణాళిక ప్రకటించగా, అమెజాన్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 16 వేల ఉద్యోగాలను తగ్గించే చర్యలు చేపట్టింది.

# లాభాల్లో దేశీయ సూచీలు..




రాబోయే రోజుల్లో బ్యాంకింగ్ సెక్టార్ భారీ లాభాలు ఆర్జించనుందనే అంచనాలు వెలువడిన నేపథ్యంలో ఆ రంగ సూచీలపై మదుపర్లు ఆసక్తి కనబరుస్తున్నారు. మరోవైపు గత సెషన్‌లో విదేశీ మదుపర్లు రూ.1355 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు కూడా సూచీలను ముందుకు నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 95.26గా ఉంది.గత సెషన్ ముగింపు (77,138)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 200 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కూడా అదే జోరు కొనసాగిస్తోంది. ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 370 పాయింట్ల లాభంతో 78,132 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 107 పాయింట్ల లాభంతో 24,378 వద్ద కదలాడుతోంది .సెన్సెక్స్, నిఫ్టీలో వెర్నోవా టీడీ, రాడికో కైతాన్, హిటాచీ ఎనర్జీ, సీజీ పవర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎమ్‌సీఎక్స్ ఇండియా, సుజ్లాన్ ఎనర్జీ, కేపీఐటీ టెక్, బీఎస్ఈ లిమిటెడ్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 345 పాయింట్ల లాభంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 130 పాయింట్ల లాభంతో ఉంది.

# దిగొచ్చిన గోల్డ్ అండ్ సిల్వర్..



అంతర్జాతీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో పాటు దేశీయంగా ప్రభుత్వ ఆంక్షలు బంగారం, వెండిని వెలవెలబోయేలా చేస్తున్నాయి. దీంతో డిమాండ్ తగ్గి వ్యాపారులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రిటైల్ షాపింగ్ చేసేవారు ముందుగా తమ నగరాల్లో తగ్గిన ధరలను పరిశీలించి ముందుకెళ్లటం బెటర్. జూలై 6న బంగారం రేట్లు తగ్గాయి. జూలై 5 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు దేశవ్యాప్తంగా గ్రాముకు రూ.11 తగ్గింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.14వేల 662గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.13వేల 440గా కొనసాగుతోంది. సోమవారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. జూలై 6, 2026న దేశవ్యాప్తంగా కేజీకి రూ.5వేలు తగ్గింది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు కేజీకి రూ.10వేలు తగ్గి రూ.2లక్షల 50వేలుగా కొనసాగుతోంది. అంటే గ్రాము దాదాపు రూ.250 దగ్గర ఉంది.




# సమంత ఊచకోత..




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం'. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి కలెక్షన్ల సునామీ సృష్టిస్తోందో అందరికీ తెలిసిందే. ఈ చిత్రం ఓవర్సీస్ మార్కెట్‌లోనూ సరికొత్త రికార్డులను తిరగరాస్తోంది. డైరెక్టర్ నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రం, జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా ఉత్తర అమెరికా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. అక్కడ ఇప్పటివరకు ఈ చిత్రం ఏకంగా 2 మిలియన్ డాలర్ల (రూ.16 కోట్లకు పైగా) మార్కును దాటి అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. టాలీవుడ్‌లో ఒక సోలో ఫీమేల్ లీడ్ సినిమా ఈ స్థాయి వసూళ్లను రాబట్టడం ఇదే తొలిసారి కావడం విశేషం. దీనితో ఉత్తర అమెరికాలో ఈ ఘనత సాధించిన మొదటి తెలుగు హీరోయిన్‌గా సమంత సరికొత్త చరిత్ర సృష్టించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.90.15 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, అతి త్వరలోనే రూ. 100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టేందుకు దూసుకుపోతోంది. సమంత కెరీర్‌లోనే ఇదొక మైల్‌స్టోన్ హిట్‌గా నిలిచిపోనుందని సామ్ ఫ్యాన్స్ మస్త్ ఖుషీ అవుతున్నారు.




# సర్‌ప్రైజుల కోసం సిద్ధంగా ఉండండి..

విలక్షణమైన వాయిస్, తన అద్భుతమైన నటనతో కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు హీరో అర్జున్ దాస్. ఇటీవల 'కాన్ సిటీ' సినిమాతో ప్రేక్షకులను అలరించారు. అయితే ఈ మూవీ ఆశించినంత స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అయినప్పటికీ అర్జున్ దాస్ ఏమాత్రం నిరాశ చెందకుండా వరుస సినిమాలను ప్రకటిస్తున్నారు. తాజాగా, తన కొత్త ప్రాజెక్ట్ 'సూపర్ హీరో బాబు' అనే ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్‌తో పాటే చిత్ర యూనిట్ ప్రేక్షకులకు ఒక ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చింది. సాధారణంగా ఏ సినిమాకైనా ఒకే ఒక్క ఫస్ట్ లుక్ విడుదల చేయడం అలవాటు. కానీ 'సూపర్ హీరో బాబు' సినిమా కోసం వరుసగా మూడు లుక్స్‌ను రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా మొదటి లుక్ జూలై 6న విడుదల కాబోతోంది. ఆ తర్వాత జూలై 8న సెకండ్ లుక్, జూలై 10న థర్డ్ లుక్‌ను రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించి అభిమానుల్లో భారీ అంచనాలను పెంచేశారు. అంతేకాకుండా "ప్రతి సర్‌ప్రైజ్‌కి దానికి తగిన ఒక ప్రత్యేక క్షణం ఉంటుంది" అంటూ చిత్ర బృందం క్రేజీ క్యాప్షన్ ఇచ్చింది. దర్శకుడు విఘ్నేష్ వేణుగోపాల్ తెరకెక్కిస్తుండగా.. అర్జున్ దాస్ సరసన తేజు అశ్విని హీరోయిన్‌గా నటిస్తోంది.

# హీరోయిన్లను తక్కువగా చూస్తారు



ఇండస్ట్రీలో కేవలం మగాళ్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఆడవాళ్లను తక్కువగా చూస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పరిస్థితి మారుతున్నప్పటికీ, తాను కెరీర్ ప్రారంభించిన 2014 సమయంలో పరిస్థితులు చాలా ఘోరంగా ఉండేవని ఆమె అన్నారు. లిల్లీ సింగ్‌తో జరిగిన ఒక ఇంటర్వ్యూలో కృతి సనన్ తన పాత రోజులను గుర్తు చేసుకున్నారు. తాను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో హీరోయిన్ పాత్రలకు అస్సలు విలువ ఉండేది కాదని ఆమె చెప్పారు. ఆ క్యారెక్టర్ ఏం చేస్తుంది, ఎక్కడి నుండి వచ్చింది, ఆమె బ్యాక్‌గ్రౌండ్ ఏంటి అనే విషయాలను అస్సలు పట్టించుకునేవారు కాదని అన్నారు. కేవలం హీరో పక్కన లవ్ ఇంట్రెస్ట్ కోసం మాత్రమే హీరోయిన్‌ను పెట్టేవారని తెలిపారు. ఇప్పుడు మహిళా నటులు మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎంచుకుంటున్నారు కానీ, ఇప్పటికీ చాలా సినిమాలు హీరోల చుట్టూనే తిరుగుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. సెట్స్‌లో హీరో, హీరోయిన్లను చూసే విధానంలో చాలా తేడా ఉంటుందని కృతి వెల్లడించారు. తాను యాక్టింగ్ నేర్చుకోకుండా ఇండస్ట్రీకి రావడం వల్ల సెట్స్‌లో డైరెక్టర్‌ను ఎక్కువ ప్రశ్నలు అడుగుతుండేదాన్నని చెప్పారు. అయితే తాను ఏదైనా సలహా ఇస్తే నువ్వు ఎక్కువగా ఆలోచిస్తున్నావు అని అనేవారని, అదే సలహా ఒక హీరో ఇస్తే మాత్రం అవును అలాగే చేద్దాం అని ఒప్పుకునేవారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా ప్రమోషన్స్ సమయంలో కూడా హీరోయిన్ ఎక్కడ మాట్లాడాలి, ఏం చేయాలి అనేది హీరోలే డిసైడ్ చేయడం తనకు నచ్చలేదని, దాంతో కొన్ని ప్రమోషన్ల నుండి తానే తప్పుకున్నానని కూడా వెల్లడించారు. తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే ఎప్పటికప్పుడు గట్టిగా ఎదురుతిరుగుతానని కృతి స్పష్టం చేశారు.



# దర్శకుడిని రిక్వెస్ట్ చేశా

టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని అఖిల్ తాజాగా 'లెనిన్' చిత్రంలో హీరోగా నటించాడు. ఈ సినిమా జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో నిన్న తిరుపతిలో ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్రబృందంతో పాటు నిర్మాతల్లో ఒకరైన నాగార్జున కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా అఖిల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అఖిల్ మాట్లాడుతూ.. "నా చివరి సినిమా విడుదలై చాలా కాలమైంది. మంచి సినిమాతోనే ప్రేక్షకుల ముందుకు రావాలనే ఉద్దేశంతోనే ఇంత సమయం తీసుకున్నాను. దర్శకుడు నందు (మురళీ కిషోర్ అబ్బూరు) ఈ సినిమా కథ చెప్పిన వెంటనే నాకు ఎంతో నచ్చింది. వెంటనే ఈ కథను వేరే హీరోతో చేయొద్దని, నాతోనే చేయాలని ఆయనను రిక్వెస్ట్ చేశాను. ఈ సినిమాను మొదట నాగ వంశీ గారే నిర్మించాలని అనుకున్నారు. కానీ నేను కూడా నిర్మాతగా ఉంటానని చెప్పాను. ఆ తర్వాత నాన్నగారు నాగార్జున, నాగ వంశీ కలిసి ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిద్దామని నిర్ణయించి షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నారు. ఆ క్షణం నాకు ఇప్పటికీ గుర్తుంది. ఈ సినిమాను ప్రేక్షకులు అద్భుతంగా ఆస్వాదిస్తారని నేను నమ్ముతున్నానని అఖిల్ చెప్పుకొచ్చారు.

# ఆ స్టార్ హీరో వల్ల నాకు గుర్తింపు వచ్చింది..



అల్లు అర్జున్‌కు ఉన్న క్రేజ్, పాపులారిటీ గురించి ఆమె చాలా ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. అల్లు అర్జున్ సినిమాలకు తెలుగులోనే కాకుండా మిగతా భాషల్లో కూడా ఏ రేంజ్‌లో ఆదరణ ఉంటుందో శ్రద్ధా దాస్ గుర్తుచేసుకున్నారు. బన్నీ నటించిన చిత్రాలకు తమిళం, మలయాళంలోకి డబ్ అయినప్పుడు కూడా అక్కడ థియేటర్లు హౌస్‌ఫుల్ అవుతాయని ఆమె చెప్పారు. దక్షిణాదిలోనే కాకుండా, ఉత్తరాదిలో కూడా ఆయన డబ్బింగ్ సినిమాలకు విపరీతమైన క్రేజ్ ఉందని తెలిపారు. అల్లు అర్జున్ చిత్రాల వల్లే తనకు నార్త్ ఇండియాలో కూడా మంచి గుర్తింపు లభించిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. తనతో కలిసి నటించిన అల్లు అర్జున్.. ప్రస్తుతం భారతదేశంలోనే అత్యంత బిగ్గెస్ట్ స్టార్ ఎదగడం తనకు ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందని శ్రద్ధా దాస్ పేర్కొన్నారు. బన్నీ స్టార్‌డమ్‌పై శ్రద్ధా దాస్ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




# చతికిలపడ్డ 'ఆల్ఫా'

బాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటైన యాష్ రాజ్ ఫిల్మ్స్ చాలా కాలంగా 'స్పై' యూనివర్స్‌లో సినిమాలను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. ఈ యూనివర్స్ ప్రారంభమైన తర్వాత తొలి చిత్రాలు అద్భుతమైన విజయాలను అందుకుని ప్రేక్షకాదరణ పొందాయి. అయితే ఇటీవల ఈ బ్యానర్ నుంచి వస్తున్న 'స్పై' జోనర్ చిత్రాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోతున్నాయి. ఆఖరుగా విడుదలైన 'వార్ 2' కూడా ప్రేక్షకులను తీవ్ర నిరాశకు గురి చేసింది. తాజాగా ఈ బ్యానర్ ఆలియా భట్ ప్రధాన పాత్రలో 'ఆల్ఫా' అనే స్పై థ్రిల్లర్‌ను రూపొందించింది. ఈ చిత్రంలో శర్వరి, బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రలు పోషించగా, హృతిక్ రోషన్ అతిథి పాత్రలో మెరిశారు. శివ్ రవైల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా జూలై 3న భారీ అంచనాల నడుమ విడుదలైంది. అయితే విడుదలైన తర్వాత ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో వసూళ్లు రాబట్టలేకపోతోంది. తొలి రెండు రోజుల్లో భారతదేశవ్యాప్తంగా రూ.21 కోట్ల నెట్ కలెక్షన్లు మాత్రమే సాధించినట్లు చిత్ర బృందం అధికారిక పోస్టర్ ద్వారా వెల్లడించింది. ఇప్పటికే ఈ సినిమాకు నెగిటివ్ టాక్ రావడంతో, రానున్న రోజుల్లో కూడా భారీ వసూళ్లు సాధించడం కష్టమేనని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో యాష్ రాజ్ ఫిల్మ్స్ 'స్పై' యూనివర్స్‌కు మరో ఎదురుదెబ్బ తగిలిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229